తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# రెండేళ్ళుగా కాగితాల్లోనే "రోప్ వే"!



**ప్రభాతవార్త-తిరుపతి:**
భవిష్యత్తు అవసరాల కోసం ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో "రోప్ వే"ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలకు రెండేళ్ళు గడిచిపోయింది. తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి కేంద్రానికి చేసిన విజ్ఞప్తి బుట్టదాఖలు అయ్యిందనే జనం చర్చ మొదలు పెట్టారు. తిరుపతికి వస్తున్న యాత్రికుల సంఖ్య... నగర జనాభాను దృష్టిలో ఉంచుకుని నగరంలో నాలుగుకిలోమీటర్లు వరకు రోప్‌వే తీసుకురావాలనే తిరుపతి ఎంపి జాతీయ రహదారుల లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ముఖ్య నిర్వహణాధికారి ప్రకాష్‌గౌర్‌ని కలిసి విన్నవించారు. పర్వతమాల పరియోజన కార్యక్రమం క్రింద తిరుపతి నగరంలో 'రోప్ వే' ఏర్పాటు చేసే విషయం ఎంతవరకు సాధ్యమనే అంశంపై కూడా పరిశీలన జరగాల్సి ఉంది. తిరుపతి యాత్రాస్థలంగానేగాక పుణ్యక్షేత్రం కావడం, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిచెందడంతో పలు ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలు తమతమ కంపెనీలను ఏర్పాటుచేశాయి. ఐఐటి, ఐఐఎస్ఇఆర్, ఐదు ప్రధాన విశ్వవిద్యాలయాలు, ప్రధానంగా తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య రెట్టింపవడం వంటివి ఇక్కడ రోప్‌వే అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. నగరజనాభా దాదాపు 5లక్షలపైగా చేరింది. రోజుకు సరాసరి లక్షమందికిపైగా యాత్రికులు దేశ విదేశాల నుంచి తిరుపతికి వస్తున్నారు. తిరుపతికి సమీపంలోని రేణిగుంట విమానాశ్రయం అంతర్జాతీయంగా రూపుదిద్దుకోవడంతో విమానాల సంఖ్య, ప్రయాణీకుల రాకపోకలు ఎక్కువైంది. తిరుపతి నగరం మీదుగా తిరుమలకు వెళ్ళే భక్తులు కూడా రెట్టింపవుతున్నారు. అటు యాత్రికులు ఇటు నగరవాసులు సాఫీగా ప్రయాణానికి నూతన మార్గాలను అన్వేషించాల్సిన అవసరం కూడా ఉంది. తిరుపతిలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ఇప్పటికే గరుడవారధి అందుబాటులో ఉంది. మరీ ఈ రోప్‌వే నాలుగుకిలోమీటర్లు వరకు ఎక్కడ నుంచి ఎక్కడకు ఏర్పాటుచేస్తారనేది కార్యాచరణ రూపొందించాలి. దేశంలోని పలు నగరాల్లో, పట్టణాల్లో ఈ రోప్‌వే ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్న సమయంలో తిరుపతిలో సాధ్యాసాధ్యాలు తెలియాల్సి ఉంది.

# అబార్షన్ కేసులు పరిశీలించి కారణాలపై నివేదిక ఇవ్వండి

**- వైద్యశాఖ అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం**



పిసిఅండ్‌పిఎన్‌డిటి యాక్ట్ అమలుపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త: జిల్లాలో అబార్షన్ జరిగిన కేసులు అన్నింటిని పరిశీలించి వాటి కారణాలపై నివేదిక రూపంలో అందించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని సమావేశ భవనంలో శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన పిసిఅండ్‌పిఎన్‌డిటి చట్టంపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుఖ ప్రసవాలు జరిగేలా గర్భిణీ స్త్రీలకు క్షేత్ర స్థాయిలో వైద్యశాఖ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. శస్త్ర చికిత్సలు ఎక్కువగా జరుగకుండా చూడాల్సిన బాధ్యత వైద్య అధికారులపై వుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి నెల 50 సుఖ ప్రసవాలు జరిగేలా చూడాలని, అలాగే ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో జరిగే అబార్షన్లపై ఎఎన్ఎంలు ఆశాల వారీగా ప్రోగ్రాం అధికారులతో ప్రతి కేసును ప్రశ్నావళితో పరిశీలన చేసి తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆర్ఎంపి డాక్టర్లకు చట్ట నిబంధనల ప్రకారం గుర్తింపు లేకుంటే ఆ క్లినిక్‌లను మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ ప్రోగ్రాం అధికారులతో అబార్షన్ కేసులు అన్నింటినీ పరిశీలించి వాటి కారణాలను నివేదిక ద్వారా తెలియజేయాలన్నారు. అలాగే ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు వైద్య సిబ్బందితో కలిసి పిహెచ్‌సి పరిధిలో జరిగే అబార్షన్లపై నిఘా వుంచి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లా పిసిఅండ్‌పిఎన్‌డిటి యాక్ట్‌ను పక్కాగా అమలు చేయాలని, ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలైన లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలకు పాల్పడితే చట్టపర, న్యాయపరమైన శిక్షలను అమలు చేయాలన్నారు. జిల్లాలో పిసిఅండ్‌పిఎన్‌డిటి చట్టంను పక్కాగా అమలు చేసి లింగ నిష్పత్తిని సమాన స్థాయికి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి, పిసిఅండ్‌పిఎన్‌డిటి యాక్ట్ ఇన్‌ఛార్జ్ నోడల్ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, దిశ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, డాక్టర్లు ఉషశ్రీ,లత, ప్రశాంత్, ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరీ, డెమో జయరాముడు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఎన్జీఓశేషాద్రి,రమావేది,రామారావు,లీగల్‌కన్సెల్టెంట్ ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు అన్నదాత సుఖీభవ

**- 2.05 లక్షల రైతులకు రూ.139 కోట్లు లబ్ది**

చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒకొక్కటి అమలుకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వంలో రైతులకు పంట సాగుకు ఆర్థిక సహాయం అందించడానికి అమలు చేసిన వైఎస్ఆర్ రైతు భరోసా పథకం స్థానంలో కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కార్యక్రమం అమలు చేస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం శనివారం అన్నదాత సుఖీభవ కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టనుంది. జిల్లాలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా 2.05 లక్షల మంది రైతులకు 138 కోట్ల రూపాయల లబ్ది కలుగనుంది. అన్నదాత మొదటి విడత కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వున్న రైతులకు ఒకొక్క రైతు ఖాతాలో రూ.7 వేలు జమ కానున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమంను ప్రకాశం జిల్లా దర్శిలో శనివారం లాంఛనంగా ప్రారంభించి రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేయనున్నారు. అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ యోజన ద్వారా ప్రభుత్వం ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సహాయం ప్రకటించింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు సహాయం చేస్తే రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.14 వేలు రైతులకు ఇవ్వనుంది. ఒక రైతుకు ఏడాదికి మూడు విడతలుగా రూ.20 వేలను ప్రభుత్వం జమ చేయనుంది. మొదటి విడతలో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2 వేలు మొత్తం కలిపి రూ.7 వేలును నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పక్కాగా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసింది.

# కన్నులపండువగా శ్రీచెంగాళమ్మకు పుష్పయాగం



పుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త : శ్రీచెంగాళమాత పరమేశ్వరి దేవస్థానంలో శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పుష్పయాగాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణలతో ఉదయం ప్రారంభమైన పుష్పయాగం మధ్యాహ్నం వరకు కొనసాగింది. వివిధ రకాల పుష్పాలతో అమ్మణ్ణికి పుష్పయాగం నిర్వహించారు. దేవస్థానం సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఉభయకర్తలుగా నంబూరు మోహన్‌రావు, సులోచనమ్మ, నంబూరు మనోజ్‌సాయి, లత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చెంగాళమ్మ ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు ఆకుతోట రమేష్, ముంగర అమరావతిలు పాల్గొన్నారు.

# జిల్లాలో ఆయుష్ సేవలను బలోపేతం చేయాలి : ఎంపి



వెంకటగిరి, ఆగస్టు 1 ప్రభాతవార్త: జిల్లాలో ఆయుష్ సేవలను మరింత చేయాలని పార్లమెంటులో ఎంపీ డాక్టర్ మద్దిల గురు మూర్తి కోరారు. ఆయుష్ వ్యవస్థల అభివృద్ధి, ఆర్థిక సహాయం, ప్రోత్సాహకాల గురించి తిరుపతి ఎంపీ శుక్రవారం పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వాన్ని వివరాలు కోరారు. ఇందుకు కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ సమాధానం ఇచ్చారు. ప్రజా ఆరోగ్యం రాష్ట్రాల పరిధిలోకి వస్తుందని, ఆయుష్ రంగంలో అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సిన అవసరం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల తీసుకునే చర్యలకు అన్ని విధాలుగా సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా గత ఐదు సంవత్సరాల్లో రూ.28.82 కోట్ల మేర కేంద్ర నిధులు విడుదలైనట్టు మంత్రి తెలిపారు. ఈ నిధులతో కాకినాడ, విశాఖపట్నంలో రెండు 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రుల ఏర్పాటుకు ఆమోదం లభించిందని, మరో నాలుగు ఆయుష్ ఆసుపత్రుల మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం మద్దతు ఇచ్చినట్టు చెప్పారు. అదే సమయంలో ఐదు ఆయుష్ ప్రజా ఆరోగ్య కార్యక్రమాలకు కూడా సహకారం అందించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 126 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, 92 కోలోకేటెడ్ ఆయుష్ కేంద్రాల్లో ప్రతి సంవత్సరం ముఖ్యమైన ఆయుష్ మందుల సరఫరాకు కేంద్రం ద్వారా మద్దతు లభించిందని మంత్రి వివరించారు. తిరుపతి జిల్లాలోని చెంగనగుంట రూ.9.08 లక్షలు, కురుగొండ రూ.8.62 లక్షలు, మోమిడి రూ.8.01 లక్షలు, మంగళం ప్రాజెక్టుకు రూ.8.29 లక్షల నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. ఈ నాలుగు కేంద్రాల ద్వారా ఏప్రిల్ 2024 నుండి జూన్ 2025 వరకు మొత్తం 25,173 మంది లబ్ధిదారులు ఆయుష్ సేవలు పొందారని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు ద్వారా ఇటీవల తిరుపతి జిల్లాలోని రాస్‌కృషి విజ్ఞాన కేంద్రంలో"నన్నారి సాగు, కోత తర్వాత నిర్వహణ, మార్కెటింగ్ అవకాశాలు" అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించబడిందని, దాని ద్వారా సుమారు 60 మంది రైతులు లబ్ధి పొందారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మద్దిల గురుమూర్తి ఆయుష్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి విస్తృతమన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మరింత విస్తృత సేవలు అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కోరారు.

# అభివృద్ధి పేరుతో దిగమింగారు... కక్కించే వరకు వదలి పెట్టం

**-రెండు రోడ్ల పనులకు భూమి పూజ కార్యక్రమంలో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి**



కైలాసగిరి రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి,ఆగస్టు 1 ప్రభాతవార్త: అభివృద్ధి పేరుతో గత పాలనలో స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఆయన అనుచరులు శివయ్య సొత్తును అప్పనంగా దిగమింగారని అన్నింటి మీద విచారణ జరిపి కక్కిస్తామని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం ఏర్పాటు చేసిన రెండు రోడ్డు పనులకు ఆయన భూమి పూజలు చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయం నిధులతో చేపట్టే ఈ పనులకు సంబంధించి వివరిస్తూ శివం టు శివం రోడ్డు పనులకు సంబంధించి గత పాలకులు రూ.49కోట్ల ప్రతిపాదనలు పంపారని తాము రూ.19కోట్లకే టెండర్లు పిలిచామని తెలిపారు. అలాగే ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న గిరి ప్రదక్షిణ రోడ్డు నిర్మాణానికి సంబంధించి రూ.9.8కోట్లతో శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఏర్పాటు చేసారు.

**రూ.9.8కోట్లతో కైలాగిరి రోడ్డు:**
శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన కైలాసగిర్లులో ప్రదక్షిణ నిర్వహించే రోడ్డు పనులకు శుక్రవారం భూమి పూజలు జరిపారు.గతంలో 11 కిలో మీటర్ల రోడ్డును రూ.14కోట్లతో చేపట్టి పూర్తి చేసారు.ఈ రోడ్డు రామాపురం రిజర్వాయర్ వరకు పూర్తి చేసారు. అక్కడ నుంచి ఆరున్నర కిలో మీటర్లు రోడ్డును రూ.9.8కోట్ల అంచనాతో టెండర్లు పిలిచారు.ఈ పనులకు భూమి పూజలను తుఫాన్ సెంటర్‌వద్ద నిర్వహించారు. ఆరు మీటర్ల వెడల్పుతో సిమెంటు రోడ్డును నిర్మించనున్నారు. ఇందులో మూడు కిలో మీటర్లు కొండలుండటంతో కాలువలను నిర్మించనున్నారు.దాంతో ప్రతి పౌర్ణమికి నిర్వహించే గిరి ప్రదక్షిణ సులభమౌతుంది.

**రూ.19కోట్లతో శివం టు శివం రోడ్డు:**
శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు పట్టణంలో ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొనకుండా ఉండటానికి శివం టు శివం రోడ్డును జాతీయ రహదారి నుంచి సుమారు.2.77 కిలో మీటర్ల రోడ్డును నిర్మించనున్నారు. ఇందులో స్వర్ణముఖి ఆనకట్ట వరకు సిమెంటు రోడ్డును నిర్మిస్తారు.ఈ ప్రాంతాలు సర్వాంగ సుందరంగా హైదరాబాదు లోని ట్యాంక్ బండ్‌ను మరిపించే విధంగా తీర్చిదిద్దాలను భూమి పూజలు చేసిన సుధీర్‌రెడ్డి అధికారులకు సూచించారు. 12 మీటర్ల వెడల్పుతో ప్రతి 10 అడుగుల దగ్గర 'వ్యూ పాయింట్'ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక్కడ శ్రీకాళహస్తి చరిత్రకు సంబంధించిన విగ్రహాలను ఏర్పాటుకు సూచించారు. చెంబేడు ఆనకట్ట నుంచి బైపాస్ వరకు తారు రోడ్డును నిర్మిస్తారు.ఈ రోడ్డుకు భూమి పూజ జరిపారు.

**గత ప్రభుత్వం పనులపై విచారణ జరుపుతాం:**
శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున గతంలో చేపట్టిన పనులకు సంబంధించి సమగ్ర విచారణ జరుపతామని ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి తెలిపారు.తాము నేడు రూ.19 కోట్లకు చేస్తున్న పనులు 2014-19లో తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శాసన సభ్యుడుగా ఉన్న సమయంలో ధర్మకర్తల మండలి ప్రతిపాదించగా అదేదో వైకాపా ప్రతిపాదించినట్లు గొప్పలు చెప్పుకున్నారు.



శివం టు శివం రోడ్డుకు భూమి పూజ

అయితే ఈ పథకంను రూ.49 కోట్లకు అంచనాలు పెంచుకున్నారని విమర్శించారు. 49కోట్లు ఎక్కడ? 19కోట్లు ఎక్కడా అని ధ్వజమెత్తారు. దేవస్థానం సొమ్ములను దోచుకోవటం ఒక్క వైకాపాకే దక్కిందన్నారు. నాలుగు మాడవీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్థంభాలపై తీవ్ర ఆరోపణలున్నాయని దానిపై కూడా ప్రత్యేక కమిటి ఏర్పాటు చేసి విచారి స్తామని సుధీర్‌రెడ్డి వివరించారు. వైకాపా వారు పందికొక్కుల్లా శివయ్య సొమ్మును దిగమింగారని అంతా విచారణ జరిపి కక్కిస్తామన్నారు.ఈ ప్రారంభోత్సవాల్లో ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఇఇ మురళీధర్‌రెడ్డి, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, కాంట్రాక్టర్ ముద్దునాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు విజయకుమార్ నాయుడు, చెంచయ్య నాయుడు, కాసరం రమేష్, పేట బాలాజి,ఆర్ముగం, పోలూరు శ్రీనివాసులురెడ్డి మాజీ కౌన్సిలర్ అనితలు పాల్గొన్నారు.

# పుత్తూరు విద్యార్ధులకు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ తదితర అధ్యాపకులు

పుత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో పివికెఎన్ డిగ్రీ కాలేజీలో జరిగిన జిల్లా స్థాయిలో పోటీల్లో పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థినులకు ప్రథమ స్థానం లభించింది. సమాచార హక్కు చట్టం ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జూలై 31వ తేదీన చిత్తూరు పివికెఎన్ కాలేజీలో జరిగిన పోటీల్లో పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బిబిఎ తృతీయ సంవత్సరం చదువుతున్న పూజారి లావణ్య వ్యాసరచనలో ప్రథమ స్థానం, బికాం (సిఎ) తృతీయ సంవత్సరం చదువుతున్న టి.వరలక్ష్మి ఉపన్యాసం పోటీలో ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం కాలేజీ లో జరిగిన అభినందన సభలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్ర మౌళి మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా అన్ని రకాల పోటీల్లో పాల్గొన్నపుడే సర్వతోముఖాభివృద్ధి కలుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులు వచ్చే వారంలో కడపలో జరగనున్న జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య, అధ్యాపకులు డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ ఎ.దేవకి, డాక్టర్ పి.వెంకటేషన్, డాక్టర్ జి.గంగయ్య, డాక్టర్ జి.తిరుమలయ్య, కె.సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం : డ్వామా పిడి

చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త: జిల్లాలో నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యు లుగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా, డ్వామా క్షేత్ర స్థాయి సిబ్బంది విధులు నిర్వహిస్తారని డ్వామా పిడి రవికుమార్ అన్నారు. డిఆర్‌డిఎ సమావేశభవనంలో శుక్రవారం వయోజన విద్యశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డ్వామా పిడి రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో 2023 సంవత్సరంలో నిర్వహించిన క్యాస్ట్ సర్వే ద్వారా 2.61 లక్షల మంది నిరక్షరాస్యులను గుర్తించడం జరిగిందన్నారు. చిత్తూరు జిల్లాలో మొదటి విడతగా 76,410 మంది వయోజనులైన నిరక్షరాస్యులను తీసుకుని డిఆర్‌డిఎ, మెప్మా, డ్వామాల సహకారంతో అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాబోయే మూడు సంవత్సరాల్లో మొత్తం 2.61 లక్షల మంది వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసి చిత్తూరు జిల్లాను అక్షరాస్యతలో అగ్ర స్థానం తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఎస్.మహ్మద్ అజాద్, డిఆర్‌డిఎ ఎపిఎం మంజుల, విద్యాశాఖ ఎడి వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ కార్యాలయ ఎఓ మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ధర్మరాజు స్వామి ధ్వజారోహణం



పుత్తూరు రూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజు స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి వేద పండితులచే ధ్వజావరోహణం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామి,అమ్మవార్లకు అభిషేకాలు, అలంకరణలు, అలాగే ఆలయ ఆవరణలో గోపూజ శ్రీకృష్ణ భగవానునికి భక్తులచే పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సాయంత్రం సుమంగళి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం సామూహిక కుంకుమార్చనలో మహిళలు అధిక సంఖ్యలో హాజరై సుమంగళి పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వితరణ ఉభయ దారుడు కె.సి.ఉమా మహేశ్వర్ జమునారాణి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుడికి పాలాభిషేకం, ధ్వజారోహణం కార్యక్రమాలు కీర్తిశేషులు దివ్య దాసరి మందడి సతీమణి రేణుకమ్మ, గాలి నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రసాద వినియోగం శ్రీమతి నిరీషా అయ్యప్పరెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం, సాయంత్రం ప్రసాదం వినియోగం పసుపులేటి నాగమణి వెంకటాచలపతి ఉభయదారులుగా వివరించారు. రాత్రి 9 గంటలకు ప్రసాద్ వినియోగం ఏ.కె.బాబు ఉభయ దాతలుగా వ్యవహరించారు. వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఉదయంతీర్థోత్సవం పాండవ కౌరవ జననం రాత్రి స్వామివారు అమ్మవారు పులి వాహనంపై ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని కోవిల్ కార్ సాల్వాకం కిష్టప్ప మొదలి తెలిపారు.

# ఎన్టీఆర్ కాలనీలో కబ్జాకోరులు!

**మాఫియాను తలపిస్తున్న దుండగులు-వరుస చోరీలతో లబ్దిదారులు**

చంద్రగిరి, ఆగస్టు 1 ప్రభాతవార్త: ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేసేయ్ ఎవరొస్తారో చూద్దామంటూ ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో దుండగులు తిరుపతికి చెందిన కబ్జాకోరులు కొందరు మాఫియాను తలపిస్తున్నట్లు బాధిత లబ్దిదారులు వాపోతున్నారు. చారిత్రాత్మక చంద్రగిరి నియోజకవర్గ కేంద్రాన్ని సమర్థవంతంగా అభివృద్ధి చేయడంలో ఎంఎల్ఏ పులివర్తి నాని తనవంతు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ కాలనీలో సుమారు రూ.12 కోట్లతో కాలనీ మొత్తం 40 అడుగులు, 30 అడుగుల విశాలమైన సిసి రోడ్లు నిర్మిస్తున్నారు. ఎన్టీఆర్ కాలనీ అభివృద్ధి వైపు అడుగులు కాస్తా పరుగులు పెడుతుండటంతో కబ్జాకోరుల దృష్టి కాలనీపై పడింది. గత ప్రభుత్వం పేదల కోసం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ ప్రభుత్వం మారాక ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీగా పేరు మార్చారు. తిరుపతికి చెందిన భాషా, నాదముని, లక్ష్మీనారాయణ, శ్రీరాములు, వెంకటముని మరి కొందరు ముఠాగా ఏర్పాటై ఖాళీ స్థలం కనబడితే కడగాలు వేసేసి ఇదేమిటని ప్రశ్నించే లబ్దిదారులను ఇది మాదే మేము కొన్నామంటూ బెదిరిస్తున్నట్లు వాపోతున్నారు. ఇంటి పట్టాలు లేకున్నా పునాధులు నిర్మించడంపై ఎవరైన ఎదురుతిరిగితే వారి వద్ద నుండి లక్షల్లో వసూలు చేసిగానీ లబ్దిదారుడి ఫ్లాట్‌ను తిరిగి ఇవ్వడం లేదని అంటున్నారు. పేదవాడు తన సొంతింటి కల నేరవేర్చుకోవడం కోసం పునాధులు తీసి ఇసుక, మట్టి, కమ్మి ఫ్లాట్ వద్దకు చేరవేస్తే రాత్రికి రాత్రే దోచుకుపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆఖరికి ఇంటి నిర్మాణం పూర్తయి ఇంటి వద్ద ఒక్కరోజు ఎవరైనా లేకుంటే వైర్లు మొత్తం లాక్కుని వెళ్ళిపోతున్నారనీ, మోటార్లు సైతం దొంగతనం చేస్తున్నట్లు తెలిసింది. ఇక్కడ పోలీసులు, రెవెన్యూ, హౌసింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయగలిగితే ఈ కబ్జాకోరుల భరతం పట్టవచ్చని అంటున్నారు. ఇప్పటికీ అనేక మంది తమ స్థలంలో ఎవరో ఇల్లు కట్టారనీ, ఇసుక, మట్టి, కమ్మీ చోరీ చేశారంటూ బెంబేలెత్తుతూ బాధితులు రెవెన్యూ, హౌసింగ్, పోలీసు అధికారులకు ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిసింది. సిబ్బంది కొరత కారణంగా పోలీసు నిఘా కొరవడటంతో పేదవాడికి కడుపుకోత మిగులుతున్నది. ఈ విషయమై ఇకనైనా అధికారులు కనీసం నెలకు రెండు పర్యాయాలు హౌసింగ్ కాలనీకి సంబంధించిన సమాచారాన్ని పరస్పరం తెలుసుకుని బాధితులకు న్యాయం చేయగలిగితే ప్రభుత్వ లక్ష్యం నెరవేరగలదని భావిస్తున్నారు.

# మేర్లపాక టోల్‌గేట్ అధికవసూళ్ళపై కేంద్రమంత్రి సీరియస్

తిరుపతికార్పొరేషన్, ఆగస్ట్ 1ప్రభాతవార్త: తిరుపతి -శ్రీకాళహస్తి మార్గంలో మేర్లపాక వద్ద టోల్‌గేట్‌లో నిర్వాహకులు అధిక టోల్‌ఛార్జీలు వసూలు చేస్తున్నారని బిజెపి తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి ఫిర్యాదు చేశారు. దీనిపై కేంద్రమంత్రి వెంటనే టోల్ ఆపరేటర్‌ను తొలగించి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. టోల్‌వసూలు ఆపరేటర్‌పై విచారణకు ఆదేశించడంతో మేర్లపాక టోల్‌గేట్‌లో అదిక ఛార్జీల వసూళ్ళు చేస్తున్న సాయికంఎనీ కలెక్టింగ్ తీరుపై సామంచి ఫిర్యాదుతో కేంద్రమంత్రి ఆదేశంతో ఆపరేటర్‌ను తొలగించనున్నారు.

**తిరుమలలో కేంద్రమంత్రి గడ్కరీ:**



కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. పద్మావతి విశ్రాంతిభవనం సముదాయం వద్ద టిటిడి అదనపు ఈఓ చిరు మామిళ్ళ వెంకయ్యాచౌదరి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. రాత్రి బసచేసి శనివారం వేకువజామున స్వామివారిని దర్శించుకోనున్నారు.

# కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఘన స్వాగతం...



రేణిగుంట ఆగస్టు 1 ప్రభాతవార్త : జాతీయ హైవేల శాఖ, కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గట్కరికి విమానాశ్రయంలో గురు వారం సాయంత్రం ఘన స్వాగతం లభించింది. ఢిల్లీ నుండి రేణిగుంట విమానాశ్రయం కుటుంబ సమేతంగా చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, టిటిడి బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి,రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్, బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, రేణిగుంట మండల బిజెపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌రెడ్డి, రేణిగుంట పట్టణ బిజెపి అధ్యక్షుడు నరేష్‌రాయల్, రాజారాయల్, బిజెపి నాయకులు రాజారాం, వేణు గోపాల్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. మేర్లపాక టోల్ ప్లాజాను ఆపరేట్ చేస్తున్న సాయి కంపెనీ స్థానికులు, రైతుల వద్ద భారీ మొత్తంలో టోల్ టాక్స్ వసూలు చేస్తున్నట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఆపరేటర్ను తొలగించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## గణనాథుడి సన్నిధిలో పూతలపట్టు ఎమ్మెల్యే



**కాణిపాకం, ఆగస్టు 1 ప్రభాతవార్త:** పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ శుక్రవారం తన జన్మదినం పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఇఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్వామి వారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు వేదమండపంలో వేద ఆశీర్వచనం చేసి స్వామి వారి శేష వస్త్రంను, తీర్థ ప్రసాదాలు, చిత్రపటంను అందజేశారు. అలాగే ఆయన శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, శ్రీనవగ్రహ ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎఇఓ రవీంద్రబాబు, సూపరిటెండెంట్ వాసు, దేవస్థానం మాజీ ఛైర్మన్ మణినాయుడు, పలువురు టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా కాణిపాకంలో ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా టిడిపి నాయకులు ఘనంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు హరిబాబునాయుడు, స్థానిక నాయకులు మధుసూధనరావు, ఎల్‌బి నాయుడు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సేవ కోసం దరఖాస్తులు

**కాణిపాకం, ఆగస్టు 1 ప్రభాతవార్త:**
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో స్వచ్ఛందంగా సేవ చేసే సేవకులు, భక్త బృందాలు దేవస్థానంకు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఇఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. దినదినాభివృద్ధి చెందుతున్న కాణిపాకం దేవస్థానంకు స్వామి వారి దర్శనార్థం ప్రతిరోజు వేలాది మంది భక్తులు వస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆలయ సందర్శనార్థం వచ్చే భక్తులకు త్వరితంగా స్వామి వారి దర్శనం కల్పించడానికి వీలుగా తిరుమల తరహాలో స్వచ్ఛంద సేవకులు, భక్త బృందాలు, సేవా సంస్థల సేవలను వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా దేవస్థానం పరిధిలోని క్యూలైన్లు, అన్న ప్రసాద వితరణ, ఉచిత ప్రసాద వితరణ, భక్తులకు తాగునీరు అందించుట వంటి సేవలను వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన సేవకులు తమ పేరు, ఫోన్ నెంబర్, పూర్తి చిరునామా, ఫోటో, ఆధార్ నెంబర్‌తో దేవస్థానం వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న సేవకులకు తాత్కాలిక గుర్తింపు కార్డు, ఎన్ని రోజులు వసతి, అన్న ప్రసాదము తదితర వివరాలను దేవస్థానం తరపున మెసేజ్ రూపంలో అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశంను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఉద్యోగుల సమస్యలపై 5న చర్చ

**కాణిపాకం, ఆగస్టు 1 ప్రభాతవార్త:**
ఉద్యోగుల సమస్యలపై ఎపి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు ఈ నెల 5వ తేదీ జిల్లా కేంద్రంలో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షులు శివయ్య తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలపై 3 నెలల కాలంలో వారానికి ఒక సమస్య లేవనెత్తి ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

– డ్వామా పిడి రవికుమార్



**చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త:** జిల్లాలో నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా, డ్వామా క్షేత్ర స్థాయి సిబ్బంది విధులు నిర్వహిస్తారని డ్వామా పిడి రవికుమార్ అన్నారు. డిఆర్‌డిఎ సమావేశభవనంలో శుక్రవారం వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డ్వామా పిడి రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో 2023 సంవత్సరంలో నిర్వహించిన క్యాస్ట్ సర్వే ద్వారా 2.61 లక్షల మంది నిరక్షరాస్యులను గుర్తించడం జరిగిందన్నారు. చిత్తూరు జిల్లాలో మొదటి విడతగా 76,410 మంది వయోజనులైన నిరక్షరాస్యులను తీసుకుని డిఆర్‌డిఎ, మెప్మా, డ్వామాల సహకారంతో అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాబోయే మూడు సంవత్సరాల్లో మొత్తం 2.61 లక్షల మంది వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసి చిత్తూరు జిల్లాను అక్షరాస్యతలో అగ్ర స్థానం తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. గ్రామ స్థాయి నిరక్షరాస్యులను గుర్తించి వారిని వాలంటీర్ టీచర్ వద్దకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత వుందన్నారు. గ్రామ స్థాయిలో ఉపాధి కూలీలను విద్యా కేంద్రాలకు తీసుకెళ్ళే బాధ్యత ఎపిఎంలు తీసుకోవాలని, ఆధునిక జీవితానికి చదువు కొద్దిగా అయిన చదువు అవసరం అన్నారు. ఈ సమావేశంలో వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఎస్.మహ్మద్ అజాద్, డిఆర్‌డిఎ ఎపిఎం మంజుల, విద్యాశాఖ ఎడి వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ కార్యాలయ ఎఓ మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా పెన్షన్ల పంపిణీ



**చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త:** క్షేత్ర స్థాయిలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సామాజిక పెన్షన్ లబ్దిదారులకు పక్కాగా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. చిత్తూరు నగర పరిధిలోని భరత్ నగర్ మూడో గేటు వద్ద శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంను పరిశీలించి నేరుగా లబ్దిదారుల ఇళ్ళకు వెళ్ళి పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పెన్షన్ దారులతో మాట్లాడి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సదర్భంగా ఇంటి వద్దకే వచ్చి పెన్షన్లు పంపిణీ చేస్తుండటం పట్ల పెన్షన్‌దారులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఆగస్టు నెలకు సంబంధించి 2,49,025 మంది పెన్షన్ దారులకు ప్రభుత్వం 94.12 కోట్ల రూపాయల విడుదల చేసిందన్నారు. శుక్రవారం సాయంత్రం నాటికి 2.54 లక్షల మందికి 88.85 కోట్ల రూపాయల పెన్షన్ లబ్దిదారులకు అందించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఎవరైనా కారణంతో ఎవరైనా పెన్షన్ తీసుకోకుంటే వారికి శనివారం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ప్రభుత్వం ఆగస్టు నెలలో కొత్తగా 4,090 మందికి పెన్షన్లు మంజూరు చేసిందన్నారు. వీరికి సైతం ఈ నెలలోనే పెన్షన్ మొత్తంను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు :

జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్

**వెదురుకుప్పం, జూలై 1 ప్రభాతవార్త :** విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ హెచ్చరించారు. మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో అలసత్వం ప్రదర్శించకూడదన్నారు.ప్రజలకు పోలీస్ వ్యవస్థపట్ల నమ్మకం కలిగించాలని చెప్పారు. కేసులు నమోదైన వాటి వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఉన్నారు. పోలీస్‌స్టేషన్‌కు జిల్లా ఎస్పీ వచ్చారని సమాచారం తెలిసి తెలుగు దేశం పార్టీ మండల క్లస్టర్ ఇన్‌చార్జీ మోహన్ మురళి, నాయకులు మునిచంద్రా రెడ్డి, చిరంజీవి రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి దుశాలతో సన్మానించారు.

## బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయం

– ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్



**పెనుమూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త:** బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిడినెల్లూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ పేర్కొన్నారు. మండలంలోని చింతపెంట పంచాయతీ తూర్పుపల్లి గ్రామంలో శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు పెన్షన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధోగతి పాలైందని, గత పాలకులు రాష్ట్రంను విధ్వంసం చేశారని, ఫలితంగా ప్రజాగ్రహానికి గురయ్యారన్నారు. ఇలాంటి పరిస్థితిల్లో రాష్ట్రానికి సిఎంగా బాధ్యతలు స్వీకరించిన నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంను ఆర్థికపరంగా గాడిలో పెట్టడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారన్నారు. ఎన్నికల్లో కూటమి పార్టీలు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం హామీలు అమలు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 15వ తేదీ నుండి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలులోకి రానుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పెద్దినేని రుద్రయ్య నాయుడు,పెద్దినేనికృష్ణమూర్తినాయుడు,మనోహర్‌రెడ్డి,చిరంజీవిరెడ్డి,తలారి రెడ్డప్ప, రాధమ్మ పాల్గొన్నారు.

## నాగాలమ్మకు సికె బాబు ప్రత్యేక పూజలు

**చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త:**



చిత్తూరు ఇందిరానగర్‌లో కొలువుతీరిన నాగలమ్మ అమ్మవారికి మాజీ ఎమ్మెల్యే, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు సికె బాబు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగాలమ్మ 22వ వార్షిక జాతర మహోత్సవానికి జాతర నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే సికె బాబును ఆహ్వానించడంతో శుక్రవారం ఆయన జాతరకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జాతర నిర్వాహకులతో కలిసి సికె బాబు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ప్రజలను ఎల్లప్పుడు చల్లగా చూడాలని ఈ సందర్భంగా అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే సికె బాబు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులు టివి శ్రీనివాసులు, సురేష్, గణేష్‌రెడ్డి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## అపోలో యూనివర్సిటీకి అంతర్జాతీయ గుర్తింపు



**చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త:**
చిత్తూరు అపోలో యూనివర్సిటీకి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. అపోలో యూనివర్సిటీకి అంతర్జాతీయ స్థాయిలో ఐఎస్ఓ 21001:2018 సర్టిఫికేట్ జారీ అయ్యింది. చిత్తూరు అపోలో యూనివర్సిటీతో పాటు తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని అపోలో నర్సింగ్ కళాశాలకు సైతం ఈ సర్టిఫికేట్ లభించింది. ఈ సర్టిఫికేట్ విద్యాసంస్థల నిర్వహణ నాణ్యతకు సంబంధించిన అత్యంత ప్రతిష్టాత్మక గుర్తింపు. చిత్తూరు అపోలో యూనివర్సిటీలోని డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి నాలెడ్జ్ సెంటర్ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం సర్టిఫికేట్ హ్యాండోవర్ కార్యక్రమం ఘనంగా జరిగింది. బిఎస్ఐ ఇండియా డైరెక్టర్ ఎం.మహేష్ మల్పధక్ ఐఎస్ఓ 21001:2018 సర్టిఫికేట్లను యూనివర్సిటీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ డాక్టర్ ఎం.పోతురాజు, చిత్తూరు అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయంతి, చెన్నై అపోలో కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ సత్యశక్తిలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్‌భట్ మాట్లాడుతూ అపోలో యూనిర్సిటీ ఆధునిక విద్యా ప్రమాణాలను పాటిస్తూ నాణ్యమైన విద్యను అందించడంలో విశ్వసనీయతను చాటుకుందని, ఐఎస్ఓ సర్టిఫికేట్ పొందడం ద్వారా తమ విద్యా, పరిపాలన విధానాలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వున్నాయని నిరూపించుకున్నామన్నారు. ప్రస్తుతం నాక్ అక్రిడిటేషన్ ప్రక్రియలో వున్నామని, వచ్చే ఏడాది జూన్ నాటికి నాక్ గుర్తింపు పొందే దిశగా కృషి చేస్తున్నామన్నారు. అపోలో నాలెడ్జ్ సిఇఓ శివరామకృష్ణన్ వర్చువల్‌గా మాట్లాడుతూ ఈ సర్టిఫికేట్ అపోలో యూనివర్సిటీకి గౌరవం మాత్రమే కాక బాధ్యతను కూడా పెంచిందన్నారు. ఉత్తమ విద్యా ప్రమాణాలు అందించే లక్ష్యంతో అపోలో నిరంతరం ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో గ్రూప్ ఆఫ్ నర్సింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ డీన్ డాక్టర్ మాలా తాయుమనవన్, అపోలో యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాకర్, డీన్‌లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర హక్కులు, ప్రయోజనాల సాధనే లక్ష్యంగా విధులు

**చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త:**



రాష్ట్ర హక్కులు, ప్రయోజనాల సాధనే లక్ష్యంగా కూటమి ఎంపీల బృందం పని చేస్తోందని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాలకు అనుగుణంగా ఎంపీలు తమ కర్తవ్యంను నిర్వర్తిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో పార్లమెంటు సమావేశాలకు హాజరైన ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం శాఖల వారీగా అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమని ఆయన ఓ ప్రకటనలో కొనియాడారు. ఇది ప్రధాని మోడి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు సిఎం నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంను ప్రగతి పథం వైపు అడుగులు వేయించాలనేది తన సంకల్పమన్నారు. రాష్ట్రానికి ఏరోస్పేస్ ఇండస్ట్రీ, స్పేస్ సిటీ, పోలవరం–బనకచర్ల, హంద్రీ–నీవాకు సంబంధించిన అంశాలను పార్లమెంటులో లేవనెత్తి కార్యరూపం దాల్చేవిధంగా ఎంపీల బృందం ప్రయత్నం చేస్తోందన్నారు. అలాగే రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులు, అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు వంటి విషయాలను ఎన్డీఏ సర్కారు ముందుంచి ఫలితాలు రాబట్టే దిశగా ఎంపీలు ముందుకు సాగుతున్నామన్నారు. మామిడి రైతులకు సమస్యలకు పరిష్కార మార్గమైన మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి మామిడి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు వారి కలలు సకారం చేసే దిశగా ఎంపీలు కృషి చేస్తున్నట్లు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు.

## హౌసింగ్ కాలనీల్లో పక్కాగా మౌళిక వసతులు

– కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

**చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త:** హౌసింగ్ కాలనీల్లో విద్యుత్ సరఫరా, రోడ్ల నిర్మాణం, ఇతర మౌళిక వసతుల కల్పన పక్కాగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశహాలులో శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ హౌసింగ్ పురోగతిపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత మూడు వారాల వ్యవధిలో 217 ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేశామని, ఈ సంఖ్యను 300కు పెంచాలని ఆదేశించారు. హౌసింగ్ కాలనీ లేఅవుట్లలో ఎక్కడైనా సమస్యలు వుంటే ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు తహసిల్దార్లతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు ఈ నెలలోపు రెండు లేదా మూడు ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసేలా లక్ష్యాలు నిర్ధేశించడం జరిగిందన్నారు. పూర్తయిన ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి బిల్లులను సత్వరం అప్‌లోడ్ చేయాలని, డిఆర్‌డిఎ ద్వారా ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులను గుర్తించి స్వయం సహాయక సంఘాల ద్వారా అర్హులకు రుణాలు మంజూరు చేయాలని, రుణాల మంజూరులో అవినీతికి పాల్పడరాదని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ ఇఇ కె.శంకరప్ప, డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, డ్వామా పిడి రవికుమార్, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## అబార్షన్ కేసులు పరిశీలించి కారణాలపై నివేదిక



**చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త:** జిల్లాలో అబార్షన్ జరిగిన కేసులు అన్నింటిని పరిశీలించి వాటి కారణాలపై నివేదిక రూపంలో అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన పిసిఅండ్‌పిఎన్‌డిటి చట్టంపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుఖ ప్రసవాలు జరిగేలా గర్భిణీ స్త్రీలకు క్షేత్ర స్థాయిలో వైద్యశాఖ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. శస్త్ర చికిత్సలు ఎక్కువగా జరుగకుండా చూడాల్సిన బాధ్యత వైద్య అధికారులపై వుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి నెల 50 సుఖ ప్రసవాలు జరిగేలా చూడాలని, అలాగే ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో జరిగే అబార్షన్లపై ఎఎన్ఎంలు ఆశాల వారీగా ప్రోగ్రాం అధికారులతో ప్రతి కేసును ప్రశ్నావళితో పరిశీలన చేసి తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆర్ఎంపి డాక్టర్లకు చట్ట నిబంధనల ప్రకారం గుర్తింపు లేకుంటే ఆ క్లినిక్‌లను మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ ప్రోగ్రాం అధికారులతో అబార్షన్ కేసులు అన్నింటినీ పరిశీలించి వాటి కారణాలను నివేదిక ద్వారా తెలియజేయాలన్నారు. అలాగే ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు వైద్య సిబ్బందితో కలిసి పిహెచ్‌సి పరిధిలో జరిగే అబార్షన్లపై నిఘా వుంచి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లా పిసిఅండ్‌పిఎన్‌డిటి యాక్ట్‌ను పక్కాగా అమలు చేయాలని, ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలైన లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలకు పాల్పడితే చట్టపర, న్యాయపరమైన శిక్షలను అమలు చేయాలన్నారు. జిల్లాలో పిసిఅండ్‌పిఎన్‌డిటి చట్టంను పక్కాగా అమలు చేసి లింగ నిష్పత్తిని సమాన స్థాయికి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, అడిషనల్ డిఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పద్మాంజలి, పిసిఅండ్‌పిఎన్‌డిటి యాక్ట్ ఇన్‌ఛార్జీ నోడల్ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, దిశా ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, డాక్టర్లు ఉషశ్రీ, లత, ప్రశాంత్, ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరీ, డెమో జయరాముడు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఎన్జీఓ శేషాద్రి, రమావేది, రామారావు, లీగల్ కన్సల్టెంట్ ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు అన్నదాత సుఖీభవ

– 2.05 లక్షల రైతులకు రూ.139 కోట్లు లబ్ధి

**చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒకొక్కటి అమలుకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వంలో రైతులకు పంట సాగుకు ఆర్థిక సహాయం అందించడానికి అమలు చేసిన వైఎస్ఆర్ రైతు భరోసా పథకం స్థానంలో కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కార్యక్రమం అమలు చేస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం శనివారం అన్నదాత సుఖీభవ కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టనుంది. జిల్లాలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా 2.05 లక్షల మంది రైతులకు 138 కోట్ల రూపాయల లబ్ధి కలుగనుంది. అన్నదాత మొదటి విడత కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వున్న రైతులకు ఒకొక్క రైతు ఖాతాలో రూ.7 వేలు జమ కానున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమంను ప్రకాశం జిల్లా దర్శిలో శనివారం లాంఛనంగా ప్రారంభించి రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేయనున్నారు. అన్నదాత సుఖీభవ–పిఎం కిసాన్ యోజన ద్వారా ప్రభుత్వం ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సహాయం ప్రకటించింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు సహాయం చేస్తే రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.14 వేలు రైతులకు ఇవ్వనుంది. ఒక రైతుకు ఏడాదికి మూడు విడతలుగా రూ.20 వేలను ప్రభుత్వం జమ చేయనుంది. మొదటి విడతలో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2 వేలు మొత్తం కలిపి రూ.7 వేలును నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పక్కాగా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసింది.

## కుప్పం అభివృద్ధి ప్రదాత సిఎం చంద్రబాబు - ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, ఆగస్టు 1 ప్రభాతవార్త**



కుప్పం ప్రాంత అభివృద్ధి ప్రదాత సిఎం చంద్రబాబునాయుడు అని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కొత్తగా మంజూరైన 109 పెన్షన్లను లబ్దిదారులకు ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కమీషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లతో కలసి లబ్దిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పంలో ఇకపై అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు పరుగులు తీస్తాయన్నారు. సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్రఅభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అందుకే సింగపూర్ దేశ పర్యటన చేశారన్నారు. సిఎం బ్రాండ్‌తోనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయన్నారు. కుప్పం మున్సిపాలిటీలో సైతం ఇప్పటికే స్టేడియం, స్మశాన వాటిక పనులు ప్రారంభించామన్నారు. త్వరలోనే సెంట్రల్ పార్క్, రోడ్డు విస్తరణ, ఇతర అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. ప్రజలు కూడా అభివృద్ధికి సహకరించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల్లో లబ్ధి కలిగిస్తామన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ ఛైర్మన్ డా॥ సుధీర్, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, కౌన్సిలర్లు సోమశేఖర్, జాకీర్, వేలు, నేతలు ఆర్ముగం, మంజు, శ్యాంసుందర్, హర్ష ధర్మతేజ, తిరుమగళ్, భాగ్యలక్ష్మి త్రిలోక్, శారదమ్మ, వెంకటప్ప, జయరాంనాయుడు, ఆర్‌ఆర్ రవి, జనసేన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అర్హులందరికీ పెన్షన్ ఇస్తున్న ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కింది

**సోమల, ఆగస్టు 1, ప్రభాతవార్త**



అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ ఇస్తూ వారిని ఆదుకుంటున్నామని తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడు పీఎం మల్లికార్జున అన్నారు. సోమల పంచాయతీలో కొత్తగా 17 వితంతు పెన్షన్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. వికలాంగులు వృద్ధుల కోసం ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పంచాయతీలో 90 పెన్షన్లు శుక్రవారం అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాయల శివకుమార్, వెంకటసుబ్బశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## దివ్య ఔషధమైన కుంకుడుకాయతో చాలా ఉపయోగాలు

**పూతలపట్టు, ఆగస్టు 1, ప్రభాతవార్త**



కుంకుడుకాయలతో మారుమూల ప్రాంతాలలో గిన్నెలు కడగడం, వ్యవసాయ పనులు అయ్యాక చేతులను కూడా కుంకుడుకాయలతో చేతులు కడగడం చేస్తుంటారు. అంటే షాంపు హ్యాండ్ వాష్ డిస్ వాస్ లిక్విడ్‌కు ప్రతున్నమైన ఇదే పద్ధతిని పట్టణాలలో అవలంబిస్తే సగానికి సగం ఇంటి డ్రైనేజ్ పైపులు ద్వారా ఉత్పన్నం అవుతున్న జల కాలుష్యం తగ్గించిన వాళ్ళం అవుతాం. దానికి చేయాల్సింది ఏమీ లేదు కుంకుడు విత్తనాలను మనం నాటితే ఒక నాలుగేళ్లలో ఇంటికి కావాల్సినంత కుంకుడు కాయలను మనమే తయారు చేసుకోవచ్చు. కుంకుడురసాన్ని ప్రకృతి సేద్యంలో చీడపీడల నివారణకు కూడా ఉపయోగిస్తారు. మనకైతే ఒక డజను కుంకుడు చెట్టు మామిడి తోటలో పెంచవచ్చును. కుంకుడు పువ్వును ఆశించి తేనెటీగలు వస్తాయి. ఏదో ఒక మూలన తేనె తప్పనిసరిగా పెడతాయి. కనీసం కేజీ తేనె ప్రతి సంవత్సరం తీసుకుంటూ ఉంటాము. ఇన్ని కుంకుడుకాయలో ఉపయోగాలు ఉంటాయని శాస్త్రవేత్తలు తెలియజేశారు.

## దగా పడుతున్న ఎస్సీ మాలలు

**పూతలపట్టు, ఆగస్టు 1, ప్రభాతవార్త :**
ఎస్సీ మాలలు దగా పడుతున్న మన రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలైన బీసీ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు అవుతున్నాయి, కాపు కార్పొరేషన్‌కి నిధులు మంజూరు అవుతున్నాయి. మాదిగలకు లిడ్కాప్ రుణాలు సుమారు 500 కోట్లు ఇచ్చి వారిని ఆర్థికంగా ఆదుకున్నారు అన్ని కులాల వారికి ఆర్థికపరంగా ఆదుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ మాలలను ఆదమరిచిందా? అన్నట్టు ఉంది. ఆర్థికంగా వెనుక పడుతున్న మాలలను ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసి ఆర్థికంగా ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## రూ.4 వేలు పెన్షన్ దేశ చరిత్రలోనే రికార్డు

**పుంగనూరు రూరల్, ఆగస్టు 1, ప్రభాతవార్త**



వృద్ధులకు ఆంధ్రప్రదేశ్లో అందిస్తున్న రూ.4 వేల పెన్షన్ భారతదేశ చరిత్రలోనే రికార్డు అని పార్టీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. మండలంలోని మంగళం గ్రామ పంచాయతీ సచివాలయంలో శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికపరంగా ఎంతో కష్టమైన పరిస్థితులు ఉన్నప్పటికీ 4000 పెన్షన్ ఇవ్వడం చారిత్రక నిర్ణయం అన్నారు. ప్రజల సమస్యలపై స్పందించే నాయకుడిగా ఆయనకు గ్రామస్థుల్లో విశేష ఆదరణ ఉంది. సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల సమన్వయంతో కార్యక్రమం సజావుగా ముగిసింది.

## సదుంకు 80 కొత్త వితంతు పెన్షన్లు మంజూరు

**సదుం ఆగస్టు 1 ప్రభాతవా ర్త** రాష్ట్ర ప్రభుత్వం సదుం మండలానికి కొత్తగా 80 ఎన్టీఆర్ భరోసా వితంతు పింఛన్లు మంజూరు చేసినట్లు ఎంపీడీవో హరిబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో శుక్రవా ర్రం సచివాలయ సిబ్బంది పెన్షన్లు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమం ఉదయం 7 గంటల నుంచి వారి ఇంటి వద్దనే పంపిణీ అందజేసినట్లు చెప్పారు. తాటిగుంటపాలెంలో నాయకుడు వెంకటరమణారెడ్డి, అమ్మగారి పల్లెలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెన్షన్ పంపిణీ చేశారు.

## శ్రావణ శుక్రవారం-రాహుకాలాభిషేకం



**బోయకొండ(చౌడేపల్లి), ఆగస్టు 1 ప్రభాతవార్త**
శ్రావణ శుక్రవారం రాహుకాలాభిషేకంతో బోయకొండ గంగమ్మ ఆలయం దద్ధరిల్లింది. ఉదయాన్నే అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారిని అభిషేకించి అలంకరించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో రాహుకాలాభిషేకాన్ని సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఆలయానికి సమీపంలోని కళ్యాణకట్ట వద్ద యాత్రీకులకు ఉచిత అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం భక్తులకు భోజనాన్ని వడ్డించారు. ఆలయ అధికార, అర్చక, సిబ్బంది సేవలందించారు.

## అదుపుతప్పిన స్కూటర్ ఒకరికి గాయాలు

**చౌడేపల్లి, ఆగస్టు 1 ప్రభాతవార్త**
స్కూటర్ అదుపుతప్పి కిందకు పడిపోవడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి–పలమనేరు ప్రధాన రహదారిలో జంగాలపల్లి క్రాస్ వద్ద చారాల నుంచి వస్తున్న టూవీలర్ అదుపుతప్పి కిందకు పడింది. ఈ ప్రమాదంలో చారాలకు చెందిన ఉత్తరాది రమణ(36)కు గాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని చౌడేపల్లి ఆరోగ్యకేంద్రానికి తరలించారు. ఇక్కడ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో 108సేవల ద్వారా మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## అన్నదాత సుఖీభవ ద్వారా రూ. 4.29కోట్లు పంపిణీ

**చౌడేపల్లి, ఆగస్టు 1 ప్రభాతవార్త**
అన్నదాత సుఖీభవ పథకం ద్వారా మండలంలోని 6129మంది రైతులకు రూ. 4.29కోట్లను పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి మోహన్‌కుమార్ తెలిపారు. ఈనెల 2న రాష్ట్ర ప్రభుత్వం తరపున మొదటి విడతగా రూ. 5వేలు, కేంద్ర ప్రభుత్వం నుంచి 20వ వడితగా రూ. 2వేలను రైతుల ఖాతాల్లోకి జమచేస్తున్నట్లు వివరించారు. ఆధార్ లింకు అయిన రైతు బ్యాంకు ఖాతాలోకి మొత్తం మీద రూ. 7వేలు జమ చేస్తారన్నారు. మండలంలోని రైతు సేవాకేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారముంటుందన్నారు.

## మండలానికి 95నూతన ఫించన్లు మంజూరు

**చౌడేపల్లి, ఆగస్టు 1 ప్రభాతవార్త**
మండలానికి 95నూతన వితంతు ఫించన్లు మంజూరైనట్లు ఎంపిడిఓ లీలామాధవి తెలిపారు. ఫించన్ల పంపిణీ 95శాతం పూర్తయ్యిందన్నారు. మండలంలో గల సచివాలయాల పరిధిలో అధికారులు ఉదయం నుంచి ఫించన్లను ఇంటింటికీ వెళ్ళి పంపిణీ చేశారన్నారు. నూతనంగా సచివాలయ ఉద్యోగులుగా బాధ్యతలు చేపట్టినప్పటికీ లక్ష్యాలను అధిగమించిన వారందరనీ అభినందించారు. మిగిలివున్న ఫించన్లను ఇళ్ళ వద్దకే వెళ్ళి అందిస్తున్నట్లు వివరించారు. ఫించన్ల పంపిణీలో అధికారులతోపాటు ఆయా పంచాయతీలకు తేదేపా నాయకులు పాల్గొన్నారు.

## వైకాపా నుంచి తెదేపాలోకి 67కుటుంబాలు చేరిక

**కుప్పం, ఆగస్టు1 ప్రభాతవార్త**



కుప్పం పట్టణం కొత్తపేట ప్రాంతంలో వైకాపాకు షాక్ తగిలింది. శుక్రవారం కొత్తపేట తెదేపా ఇన్‌చార్జ్ ముఖేష్ (అప్పు) అధ్వర్యంలో సుమారు 67 కుటుంబాలు వైకాపాను వీడి తెదేపాలో చేరారు. వీరిని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ కంచర్ల మాట్లాడుతూ కుప్పం ప్రజలు సిఎం చంద్రబాబునాయుడుపై అమితమైన ప్రేమ చూపుతారని అందుకు రెట్టింపుగా సిఎం కూడా కుప్పం ప్రజలపై ప్రేమాభిమానాలు చూపుతారన్నారు. సిఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి చూసి పార్టీలో ఇంతమంది చేరడం శుభసూచకమన్నారు. అవినీతి రహిత పాలన కోరేవారు సిఎం చంద్రబాబుతో కలసి నడవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ డా॥ సుధీర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు, విస్తరణ కమిటీ సభ్యుడు మంజునాథ్, టిఎన్‌ఎస్‌ఎఫ్ మునెప్ప, కోక్లస్టర్ ఇన్‌చార్జ్ తిరుమగళ్, నేతలు మహేంద్ర, మురళి, లోకేష్, సుకుమార్, కృష్ణ, రాహుల్, సురేష్, ఉదయ్‌కుమార్, కడ సభ్యులు సుగుణమ్మ, మహిళా నేత భాగ్యలక్ష్మిత్రిలోక్ పాల్గొన్నారు.

## కుప్పం నుంచి ఇచ్ఛాపురం దాకా రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

**కుప్పం, ఆగస్టు1 ప్రభాతవార్త** రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు రాజ్యాంగ పరిరక్షణ యాత్రను ఈనెల 3వతేది ఆదివారం కుప్పంలో ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన పరిరక్షణ యాత్ర కరపత్రాలు ఆవిష్కరించి మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమలా సుదర్శన్‌తో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ ఇచ్చిన రిజర్వేషన్లు, హక్కులు కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నామన్నారు. దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు అమలు చేయాలని, పెరిగిన ఎస్సీ జనాభాకు అనుగుణంగా ఇరవై శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. దళితుల మీద దాడులను వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమలా సుదర్శనం మాట్లాడుతూ దేశంలో దళితులు, బడుగులను అణచాలనే విధంగా ప్రయత్నాలు జరగడం దారుణమన్నారు. ఇలాంటివాటిని తిప్పికొడతామన్నారు. కార్యక్రమంలో నేతలు చెన్నకేశవులు, యమల చంద్రశేఖర్, మనోహర్, గోవిందప్ప, కుమార్, శ్రీనాథ్‌బాబు, గురుమూర్తి, హరిబాబు పాల్గొన్నారు.
ఫోటో రైటప్ :



## శ్రీవారి ఆలయ నిర్మాణానికి సహకరిస్తాం

-టిటిడి ఛైర్మన్‌తో అస్సాం సిఎం హిమంత్‌శర్మ

**తిరుమల.ఆగస్ట్ 1ప్రభాతవార్తప్రతినిధి:** అస్సాం రాష్ట్రం గౌహతిలో టిటిడి శ్రీవారి ఆలయం నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపుకు ఆ రాష్ట్ర సిఎం హిమంత్ బిస్వా శర్మ అంగీకరించారు. శుక్రవారం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, గౌహతిలో ఆరాష్ట్ర ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఐదెకరాల స్థలం కేటాయించడంతోబాటు ఆలయ నిర్మాణానికి అన్ని రకాల సహాయసహకారాలు అందిస్తామని సిఎం హామీ ఇచ్చారు.



## శ్రీవారి సేవలో ప్రముఖులు

**తిరుమల,ఆగస్ట్ 1ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలేశుని శుక్రవారం ఉదయం ఢిల్లీ మంత్రి పర్వేశ్‌వర్మ, సింగర్ ఉష ఉదయం విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## జూడోలో ఎంజీఎం విద్యార్థుల ప్రతిభ



**తిరుపతి విద్య, ఆగస్టు 1 ప్రభాతవార్త :** స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా గురువారం జరిగిన సబ్జూనియర్ జూడో పోటీలలో బైరాగి పట్టెడలోని మహాత్మా గాంధీ మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 10వతరగతి విద్యార్థి ఎన్ యుగేంద్ర గోల్డ్ మెడల్ సాధించగా, 9వతరగతి విద్యార్థులు ఎన్ చరణ్, సి కృష్ణ సిల్వర్ మెడల్ సాధించారు.అలాగే ధరణి పతి,ఆర్ హరి,పి వంశీ,వి దాదా,ఎన్ చరణ్ తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పరంధామనాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోండి

**తిరుపతి విద్య, ఆగస్టు 1 ప్రభాతవార్త:** ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5వ తేదీన జరగనున్న స్పాట్ అడ్మిషన్లకు ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో పలు కోర్సులకు సంబంధించి 35 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.

## ఏఎన్ఎంల జీవితాల్లో భద్రత కరువు

**రేణిగుంట, ఆగస్టు 1 ప్రభాతవార్త :** సమాజంలో అందరి ఆరోగ్య భద్రత కోసం నిరంతరం శ్రమించే ఏఎన్ఎంల జీవిత చమరాంకంలో భద్రత పూర్తిగా కరువైందనడంలో ఎలాంటి సందేహం లేదు. కుగ్రామాలకు వెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజల జీవితాల్లో ఆరోగ్యాన్ని నింపే వారి బతుకులు ఎందుకు పనికిరాని ఎంగిలి ఇస్తరాకుల్లా మారిపోతున్నాయి. ఇచ్చేది చాలీచాలని జీతాలు చేసేది నిరంతర సేవ. ఏఎన్ఎం ఉద్యోగులను తాత్కాలిక సిబ్బందిగా చూపిస్తూ వారికి ఉద్యోగాల్లో రెగ్యులైజేషన్ లేకుండా 25 సంవత్సరాల వరకు ప్రభుత్వాలు ఉద్యోగాలు చేయిస్తున్నాయి అనడంలో నిజం లేకపోలేదు. వారి సేవలకు ప్రభుత్వం స్పందించి జీతాలు పెంచి, రిటైర్మెంట్ తర్వాత వారికి కనీస భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణం వారి జీవితాల్లో వెలుగు నింపాలని అందరూ ఆశిద్దాం...



## పాఠశాలకు పథకాల పంట

**రేణిగుంట, ఆగస్టు 1 ప్రభాతవార్త :** రేణిగుంట బాలికల ప్లస్‌టు ఉన్నత పాఠశాల విద్యార్థినులు జాతీయస్థాయి జరిగిన రెజ్లింగ్, గ్రాప్లింగ్ పోటీల్లో పథకాల పంట పండించారు. చత్తీస్ ఘడ్ రాష్ట్రం బిలాస్ పూర్ లో జూలై నెల 26 వ తేదీ నుండి 29 వ వరకు జరిగిన జాతీయస్థాయి గ్రాబ్లింగ్, రెజ్లింగ్ పోటీల్లో రేణిగుంట బాలికల ప్లస్‌టు ఉన్నత పాఠశాల విద్యార్థినులు అత్యంత ప్రతిభ కనపరచి 4 బంగారు పథకాలు, 5 వెండి పథకాలు, 3 రజిత పథకాలు కైవసం చేసుకున్నారు. పథకాలు దక్కించుకొని పాఠశాల కీర్తి పతాకాలను జాతీయ స్థాయిలో ఎగరవేసిన విద్యార్థినులను పాఠశాల ప్రధానాచార్యులు శ్యామల, మాజీ ప్రధానాచార్యులు విష్ణువర్ధని, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు అభినందించారు.

## గోడపత్రికలను ఆవిష్కరించిన సిపిఐ నేతలు



**రేణిగుంట ఆగస్టు 1 ప్రభాతవార్త :** సిపిఐ తిరుపతి జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ నేతలు శుక్రవారం రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద గోడ ప్రతులను విడుదల చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వర్ష వేడుకల్లో భాగంగా సిపిఐ తిరుపతి జిల్లా ద్వితీయ మహాసభలో ఆగస్టు నెల 3, 4 తేదీల్లో సూళ్లూరుపేటలో నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ కార్యదర్శి వైయస్ మణి తెలిపారు. మహాసభలకు సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కత్తి నరసింహారావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, విజయలక్ష్మి తదితరులు పాల్గొంటారన్నారు. గోడ ప్రతులు విడుదల చేసిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు మురళి, రేణిగుంట ఏఐటీయూసీమండలకార్యదర్శివికార్తీక్, సుబ్బరాజు, చంద్రకళ, సెల్మా రమణ, భాను, తరుణ్ ఉన్నారు..



## కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది

**రేణిగుంట, ఆగస్టు 1 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన అత్తూరు సుబ్రహ్మణ్యం రెడ్డి భౌతిక కాయాన్ని శ్రీకాళహస్తి శాసనసభ్యులు సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ శుక్రవారం సందర్శించాలి. ఆయన భౌతిక కాయానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు..

## వితంతు పింఛన్లు పంపిణీ

**రేణిగుంట, ఆగస్టు 1 ప్రభాతవార్త:** రేణిగుంట పట్టణంలో 25 మందికి కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లు అందజేసినట్లు రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చొరవతో రేణిగుంట మండలంలో దాదాపు 200 వితంతు పింఛన్లు మంజూరయ్యాయి. వీటిని రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, ఎంపీడీవో ప్రభురావు, కార్యదర్శి మాధవి, సానిటరీ ఇన్స్పెక్టర్ రవి, టిడిపి నేత కన్నన్ రెడ్డి తదితరులు లబ్ధిదారులకు శుక్రవారం ఉదయం పంపిణీ చేశారు.

## ఆగష్టు నెలలో ఏపీ ప్రజలకు సంక్షేమ జాతర



**తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** ఆగష్టు నెలలో ఏపీ ప్రజలకు కూటమి ప్రభుత్వం సంక్షేమ జాతరలా ఇంటింటికి పథకాలు అందజేస్తుందని రాష్ట్ర బీసీ సాధికారిక సభ్యులు, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి సత్తు మధుసూధన్ యాదవ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సుందర్‌నగర్, శివజ్యోతినగర్‌లో ఇంటింటికి వెళ్ళి పెన్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు రావెళ్ళ సుబ్బరాయులునాయుడు, నాగేంద్రకుమార్, సుబ్రమణ్యం,నాగయ్య,సుజాత,సచివాలయసిబ్బంది, పాల్గొన్నారు.

## వితంతు పించన్లతో కుటుంబానికి భరోసా



చంద్రగిరి, ఆగస్టు 1 ప్రభాతవార్త: వితంతు పించన్లతో బాధిత కుటుంబానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తున్నట్లు టిడిపి సీనియర్ నాయకుడు పులికంటి మోహన్ రెడ్డి తెలిపారు. తొండవాడలో శుక్రవారం ఆయన పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు ఉమాపతి రెడ్డితో కలసి నూతన పించన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామకమిటీ ప్రధాన కార్యదర్శి వి.రాఘవేంద్ర, జగన్మోహన్ నాయుడు, అయ్యప్ప, డి.మురళి, జయబాబు, తదితరులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ పించన్లు : తిరుమల రెడ్డి

**రామచంద్రాపురం, ఆగస్టు 1 ప్రభాతవార్త:** అర్హులందరికీ ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తుందని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి అన్నారు. శుక్రవారం నూతనంగా మంజూరు చేసిన వితంతు పించన్లను ఆయన పంపిణీ చేశారు. మండలంలో 92 మందికి నూతనంగా పిఛన్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్ధన్ చౌదరి, మాజీ ఎంపిపి బింధుమాదవి, టిఎన్‌టియుసి అధ్యక్షుడు సోము రాయల్, నాయకులు సుగుణమ్మ, ఢిల్లీ, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా తల్లి పాల వారోత్సవ ర్యాలీ

**చంద్రగిరి, ఆగస్టు 1 ప్రభాతవార్త:** ప్రపంచ తల్లి పాలు వారోత్సవాలను పురస్కరించుకుని ఎస్వీఎంసి కమ్యూనిటీ మెడిసిన్ హెచ్ఓడి డాక్టర్ సునీత అధ్యక్షతన శుక్రవారం గ్రామీణ ఆరోగ్య శిక్షణా కేంద్రంలో హెల్త్ ఆఫీసర్ ఐ.యుగంధర్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రసవం అయిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని అన్నారు. ముర్రుపాలు చంటి బిడ్డకు అమృతప్రాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యుగంధర్, ప్రొఫెసర్ డాక్టర్ దయాకర్, డాక్టట్ కృష్ణకుమారి, డాక్టర్ హేమచంద్ర, డాక్టర్ శశికళ, డాక్టర్ శ్రీదర్, డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ సౌమ్య ప్రియ, డాక్టర్ రేవతి, పిజిలు డాక్టర్ మోహన్, డాక్టర్ రాహుల్, డాక్టర్ సంధీప్ మేఘ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ టాటాబాయి, సూపర్‌వైజర్లు ప్రమీల, నారాయణరాజు, తులసీరామ్, ఏఎన్ఎంలు సుబ్బలక్ష్మి, గిరిజ, శశిరేఖ. వాసంతి, ట్యూటర్ ధన, తదితరులు పాల్గొన్నారు.

## నేడు వానగుట్టపల్లిలో ఆడికృత్తిక వేడుకలు

**కుప్పంరూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** మండలంలోని వానగుట్టపల్లి గ్రామంలో శనివారం ఆడికృత్తిక వేడుకలు జరుపుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొక్కులు కలిగిన భక్తులు కావడులు చెల్లిస్తారన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం జరుపుతున్నట్లు తెలిపారు.

## పతంజలి యోగా సమితిచే...ఆయుర్వేదయోగ సమన్వయం



**తిరుపతిరవాణ, ఆగస్ట్ 1ప్రభాతవార్త:** పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో మంచినీళ్ళగుంట ప్రాంతంలో ఆయుర్వేద యోగ సమన్వయం శిక్షణ జరిగింది. నెలరోజులపాటు జరిగే ఈ శిక్షణలో 140మంది శిక్షణ పొందుతున్నారు. దక్షిణాదిరాష్ట్రాల ఇన్‌ఛార్జి స్వామిరిత్‌దేవ్ పాల్గొని యోగా ప్రాధాన్యత తెలిపారు. ఆయుర్వేద యోగ సమన్వయం గురించి వివరించారు. అన్ని జిల్లాల నుండి పతంజలి యోగా కార్యకర్తలు, భారత స్వాభిమాన్ రాష్ట్ర అధ్యక్షుడు జొన్నగడ్డ శ్రీనివాస్, యోగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఒంగోలు బాలు, మహిళ అధ్యక్షురాలు మంజుశ్రీ, ఇంచార్జి మంగయ్య, కౌలాససింగ్ రాజ్‌పురోహిత్, ఓటేరు కృష్ణ, రాధిక, ఉమ, తంగరాజు,రవి పాల్గొన్నారు.

## ఘంటసాల విగ్రహానికి పాలాబిషేకం



**తిరుపతిరవాణ, ఆగస్ట్ 1ప్రభాతవార్త :** అమరగాయకుడు, తెలుగువారి మదిలో చిరస్థాయిగా నిలిచిన ఘంటసాల వేంకటేశ్వరరావు ప్రతి ఒక్కరికీ ఆదర్శ ప్రాయుడని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. భవానీనగర్‌కూడలిలో ఉన్న ఘంటసాల విగ్రహానికి రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు, ఘంటసాల అబిమానులు కొట్టే సుబ్రమణ్యంరెడ్డి, కెవెన్ రాజా, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి,అక్కిపల్లి మునికృష్ణయ్యయాదవ్, ఆంజనేయులు, చంద్రశేఖర్, కస్పాపద్మనాభం, ఉపాధ్యాయుడు తిరుమలయ్య,జనార్దన్‌రెడ్డి, సురేష్‌స్వామి, బ్యాంకు విశ్రాంత ఉద్యోగి పద్మనాభం వినాయకరెడ్డి,శాంబోలు హరినాథ్ తదితరులు పుష్పాంజలి ఘటించారు.

## ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

**పుత్తూరు రూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజిమాధవయ్య సూచన మేరకు పుత్తూరు మండలంలో ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమం టీడీపీ నాయకులు నిర్వహించారు. శుక్రవారం మండలంలోని శిరుగురాజుపాళెం పంచాయతీ దిగువగూళూరు గ్రామంలో భర్త చనిపోయిన వితంతవు జె.మంగమ్మకు ఎన్‌టీఆర్ భరోసా వితంతవు పింఛన్ తడుకు సింగిల్‌విండో ఛైర్మన్ కరుణ అందజేశారు. అలాగే పుత్తూరు రూరల్ మండలంలోని వేపగుంట గ్రామంలో ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ పుత్తూరు రూరల్ పార్టీ అధ్యక్షుడు బాలాజీ, పుత్తూరు మండల మహిళా అధ్యక్షురాలు కవిత, గ్రామ కమిటీ అధ్యక్షుడు శేఖర్‌నాయుడు, నాయకులు కోటయ్య, బుజ్జిబాబులు కార్యక్రమం నిర్వహించారు.

## సీఐకి వినతిపత్రం అందజేసిన సీపీఐ

**పుత్తూరు రూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** పుత్తూరులో నిత్యం ఎదుర్కొంటున్న ప్రజలు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కళాశాల వద్ద ఉదయం, సాయంత్రం బీట్ ఏపించాలని పుత్తూరుకి బదిలీపై వచ్చిన సీఐ కె.ఆర్.శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పుత్తూరు నిత్యం ఎదుర్కొంటున్న ఆర్‌డీఎం గేటు వద్ద నిత్యం ట్రాఫిక్‌ను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పుత్తూరు మండల కార్యదర్శి మహేష్, నాయకులు గోపి, మనీ, రమేష్, రవి, భాస్కర్, రమణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తు స్వీకరణ



**సత్యవేడు, ఆగస్టు 1 ప్రభాతవార్త:** సత్యవేడు పాలిటెక్నికల్ కళాశాలలో వివిధ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్ల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు స్థానిక పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి తెలిపారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సత్యవేడు పాలిటెక్నికల్ కళాశాలలో ఈసీఈ 46, మెకానికల్ ఇంజనీర్ 62, సివిల్ ఇంజనీర్ 63 సీట్లు భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు పాలిసెట్ 2025 హాల్ టికెట్, ర్యాంకు కార్డు, పదో తరగతి మార్కు లిస్టు, టీసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల ధృవీకరణ పత్రం, 4వ తరగతి నుంచి 10 వరకు స్టడీ సర్టిఫికెట్, ఉద్యోగ రీత్యా బయట ఉన్న తల్లిదండ్రుల పిల్లలు తహసీల్దార్ సర్టిఫికెట్, 2025-26 సంవత్సరానికి సంబంధించి ఈ డబ్ల్యుఎస్ సర్టిఫికెట్ తదితర ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్లు జిరాక్స్‌కాపీలు సమర్పించాలన్నారు. ఆగస్టు 4 తేదీ లోపు కళాశాలకు ఇవన్నీ సమర్పించాల్సి ఉందన్నారు.

## తహసీల్దార్ రాజశేఖర్‌ని సన్మానించిన కాంగ్రెస్ నేతలు



**సత్యవేడు, ఆగస్టు 1 ప్రభాతవార్త:** సత్యవేడు తహసీల్దార్ రాజశేఖర్‌ని స్థానిక కాంగ్రెస్ నేతలు సన్మానించారు. శుక్రవారం సత్యవేడు కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘునాథ్, జనరల్ సెక్రటరీ చిన్నరాజ్, పట్టణ అధ్యక్షులు అంబేద్కర్ తదితరులు తహసీల్దార్ రాజశేఖర్‌ని కలిశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు తహసీల్దార్ రాజశేఖర్‌కు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

## వాతావరణ ఆధారిత సేద్యం లాభదాయకం



**వడమాలపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త:** వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా, పంట విత్తే సమయాన్ని, సాగు చేయవలసిన పంట రకాలను రైతులు ఎంచుకున్నప్పుడే మంచి దిగుబడులను పొందగలరని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని వడమాలపేట గ్రామంలో పీఎం ఆర్‌కేవీవై పథకం కింద రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాలరావు మాట్లాడుతూ ఒకే రకమైన పంటను, ఒకే రకాన్ని ఎప్పుడూ పండిస్తూ ఉంటే దిగుబడి తగ్గడమే గాక, చీడ పీడల ఉధృతికూడా ఎక్కువవతుందని తెలియజేశారు. వడమాలపేట మండల వ్యవసాయ అధికారి విజయకుమార్, వ్యవసాయ శాఖ ప్రస్తుతం అమలు చేస్తున్న వివిధ పథకాలను, పంటల బీమా పథకం గురించి, వివరించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు మోహన్, శ్రీవాణి, మోహన్‌రాజా, జిల్లా వనరుల కేంద్రం ఏఈవో రవి ప్రసాద్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## అవగాహన సదస్సుకు స్పందన



**తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** తిరుచానూరు స్థానిక ఓ ప్రైవేట్ హాట్‌లో విదేశీ విద్యపై శుక్రవారం జరిగిన ఉచిత సదస్సుకు విశేష స్పందన లభించినట్లు ఐఎంఎఫ్ఎస్ సంస్థ జనరల్ మేనేజర్ సాయి ఉత్తం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యుకే తదితర దేశాల్లో ఉన్న ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొని అక్కడి విద్యా విధానం, ప్రవేశ ప్రక్రియ, స్కాలర్‌షిప్‌లు, వీసీ విధానాలపై విస్తృతంగా వివరించారు.

# తిరుపతి డివిజన్

## గ్రామాభివృద్ధికి సెక్రటరీ సూచనలు అవసరం



**తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** తుమ్మలగుంట గ్రామ పంచాయితీ అభివృద్ధికి సెక్రటరీ సూచనలు, సలహాలు ఎంతైనా అవసరమని గ్రామ కమిటి అధ్యక్షులు భరత్‌కుమార్‌రెడ్డి(బాను), వార్డు మెంబర్లు రాధారాయల్, గురవారెడ్డి, టీడీపీ సీనియర్ నేత, చంద్రగిరి యూనిట్ ఇన్‌చార్జి బిరుదాల సిద్దారెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తిరుపతిలో వారు మీడియాతో మాట్లాడారు. పంచాయితీలో శుక్రవారం గ్రామ సభ జరిగిందన్నారు. అ గ్రామ సభలో సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీటీలకే కాకుండా గ్రామ స్థాయిలో జరిగే సభలకు, సమావేశాలకు తమకు కూడా ప్రోటోకాల్స్ ఇవ్వాలని కోరారు.

## ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్

**కేవీబీ పురం, ఆగస్టు 1 ప్రభాతవార్త:** మండలంలోని కళత్తూరు గ్రామంలో తిరుపతి పార్లమెంట్ రైతు విభాగ అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్‌రెడ్డి కూటమి నాయకులు ఎస్సీ సెల్ అధ్యక్షుడు యూనిట్ అధ్యక్షుడు వి.సాధు, కేవీబీ పురం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు థామస్, ఏకరి సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటకృష్ణయ్య, యువ నాయకులు విమల్‌రాజు, ప్రశాంత్, కార్యకర్తలు ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు.

## తుమ్మలగుంటలో సోషల్ ఆడిట్‌పై గ్రామసభ



**తిరుపతిరూరల్, ఆగస్టు1 ప్రభాతవార్త:** తుమ్మలగుంట గ్రామ పంచాయతీలో మహాత్మగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనుల రికార్డు పరిశీనలో భాగంగా శుక్రవారం గ్రామసభ జరిగింది. ఎన్ఆర్ఇజిఎస్ పథకం కింద జరిగిన పనులపై సమగ్రంగా పూర్తిస్థాయిలో రికార్డు తనిఖీ చేసినట్లు డిఆర్పీ తెలిపారు. రోడ్లు, సైడ్ డ్రైన్స్, హౌసింగ్, పెన్సన్స్‌లో లబ్దిదారులను గుర్తించుట, అటవీ, సర్వశిక్షా అభియాన్, పశుసంవర్ధకశాఖ తదితర శాఖలలో సామాజిక తనిఖీ చేసినట్లు తెలిపారు. గత మూడురోజుల పాటు గ్రామ పంచాయతీలో డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్ మూడురోజులు పాటు ఉండి, రికార్డు పరిశీలిన చేసినట్లు వివరించారు. చివరి రోజున సర్పంచ్ సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి, కొత్త మంజూరైన విడో పెన్సన్స్ లబ్దిదారులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెయ్యాల వెంకటేశ్వర్లు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బిరుదాల భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ గోపాల్‌రెడ్డి, కేశవులశెట్టి, ఎంపిటిసి బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

## యజమానులకు చట్టబద్ధమైన యాజమాన్య కార్డులు



**తిరుపతిరూరల్,ఆగష్టు1 ప్రభాతవార్త:** ఆయా గ్రామాలలోని గ్రామ కంఠాలను సర్వే చేసి, గ్రామకంఠాలల్లో వున్న యజమానులకు చట్టబద్ధమైన యాజమాన్య హక్కు కార్డులు పంపిణి చేయడమే స్వామిత్వ పథకం ముఖ్య ఉద్దేశమని విఆర్వో దీప తెలిపారు. శుక్రవారం తిరుపతిరూరల్ మండలం సి.మల్లవరం గ్రామ పంచాయతీ పరిధిలోని కాలూరులో స్వామిత్వ పథకంపై ప్రజలకు అవగాన కల్పిస్తూ సర్పంచ్ మొక్కల భారతి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కాలూరులో గ్రామ ఉన్న గ్రామకంఠాన్ని గుర్తించి, పూర్తిస్థాయి విస్తీర్ణం సర్వే చేసి, ఆ స్థలంలో ఉన్న లబ్దిదారులకు ప్రభుత్వం హక్కు పత్రాన్ని అందిస్తుందని తెలిపారు. పంచాయతీ కార్యధర్శి కృష్ణ, ఉప సర్పంచ్ సెహన భేగం పాల్గొన్నారు.

**కాలూరు గ్రామసభలో రసభస:** కాలూరులో స్వామిత్వ పథకంపై జరిగిన గ్రామసభ రసభసగా మారింది. ప్రోటోకాల్ పాటించకుండా గ్రామసభ నిర్వహించడంపై టిడిపి అధ్యక్షుడు మనోహర్ చౌదరి మండిపడ్డారు. వేదికపై టిడిపి అధ్యక్షుడుకి స్థానం లేదా అంటూ ప్రశ్నించడంతో గ్రామసభ రసభసాగ మారింది. సర్పంచ్ భర్తతిమ్మారెడ్డి, మనోహార్ చౌదరి మధ్య వాగ్వివాదం జరిగింది. పౌరష పదజాలంతో ధూషించుకున్నారు.

## రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందించండి



**తొట్టంబేడు,ఆగస్టు 1 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గం పుణ్యక్షేత్రమని అయితే ఇక్కడ చారిత్రక, ప్రపంచ ప్రసిద్ధి చెందిన దేవాలయాలు ఉన్నాయని అక్కడకు వెళ్ళటానికి సరైన రోడ్లు సదుపాయం లేదని ప్రత్యేక నిధులు అందించి ఆదుకోవాలని తిరుపతిజిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర రహదారులు,భవనాల శాఖ మంత్రి నితిన్‌గడ్కారికి స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి వినతి పత్రం అందించారు. శ్రీకాళహస్తికి తిరుపతి నుంచి రేణిగుంట మీదుగా ప్రత్యేక రహదారం సదుపాయాన్ని కల్పించాలని, అలాగే తడ నుండి శ్రీకాళహస్తికి ఏర్పాటు చేస్తున్న రోడ్డును ఆరు లైన్లు చేసి, జాతీయ రహదారిగా గుర్తించాలని అభ్యర్థించారు. కేంద్ర మంత్రితో పాటు రాష్ట్ర మంత్రి బిసి జనార్థన్‌రెడ్డి కూడా ఉన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మరో చారిత్రక ఆలయం గుడిమల్లంలోని పరశురామేశ్వరాలయం అని వివరించారు. ఈ ఆలయానికి సంబంధించిన సమాచార పత్రికను ఎంఎల్ఏ అందించారు. కానీ నియోజకవర్గం లోని పలు ఆర్‌అండ్‌బి రోడ్లకు సంబంధించి నిధుల కొరతతో తల్లడిల్లు తున్నాయని వివరించారు.

## విద్యార్థులు దుర అలవాట్లకు దూరంగా ఉండాలి



**తిరుపతిరూరల్,ఆగష్టు1 ప్రభాతవార్త:** మత్తు పదార్ధాలు సేవించడం వల్ల అనారోగ్యం సంభవించి... జీవితాలే నాశనమైతాయని...విద్యార్థులు మత్తు పదార్ధాలకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ టి.విజయశేఖర్, డిపిఇఓ కె.నాగమల్లేశ్వరరెడ్డిలు సూచించారు. శుక్రవారం తిరుపతిరూరల్ మండలం సి.గొల్లపల్లిలో ఉన్న సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు 'యాంటీ డ్రగ్స్ అవేర్నెస్' కల్పించారు. విద్యార్థులచే నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు ఎపిఎస్‌బిసిఎల్ డిఎం జానకిరామ్, తిరుపతిరూరల్ ఇన్స్పెక్టర్ నరసానాయుడు, టిడిఎఫ్ ఇన్స్పెక్టర్ శ్యామ్ ప్రసాద్, సబ్ ఇన్స్పెక్టర్ కవీశ్వరనాయుడు,, కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ భరోసా పెన్సన్స్ పంఫిణి

**తిరుపతిరూరల్,ఆగష్టు1 ప్రభాతవార్త:** అర్హులైన లబ్దిదారులకు బాధ్యతగా ఒకటో తారీఖునే ఎన్‌టిఆర్ పెన్సన్స్ పంఫిణి చేస్తున్నట్లు టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ బిరుదాల భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, బిల్‌కలెక్టర్ యోగానందరెడ్డి, కేశవులు శెట్టి తదితరులు పాల్గొన్నారు.



## బిడ్డల ఆరోగ్యానికి తల్లి పాలు శ్రేష్టం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 1 ప్రభాతవార్త :** పుట్టిన బిడ్డలకు ఎదిగే బిడ్డలకు తల్లి పాలు ఎంతో శ్రేష్టమని శ్రీకాళహస్తి సిడిపిఓ శాంతి దుర్గ అన్నారు.శుక్రవారం ఆమె మండలంలో తల్లి పాల వారోత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆగస్టు 1 నుంచి 8 వరకు తల్లి పాల వారోత్సవాలు నిర్వహించటం ఆనవాయితిగా వస్తుందన్నారు. శ్రీకాళహస్తికి సమీపంలోని తిరుమంజనం వారి కండ్రిగలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ సమావేశంలో మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంట లోపల పాలను పట్టించాలని దాని వలన ప్రయోజనాలు వివరించారు.ఈ సమావేశంలో అభిషేక్ గౌడ్,గ్రామస్తులు పాల్గొన్నారు.

## పల్లెటూరు పిల్లలు జూడోలు చిచ్చర పిడుగులు



**శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 1 ప్రభాతవార్త:** వారు పల్లెటూరు పిల్లలు.ఆటల్లో చిచ్చర పిడుగులు. రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు పల్లం విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం పల్లం పాఠశాలలో విద్యార్థులకు సత్కరించారు. శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లేక్సు నందు జరిగిన జూడో పోటీల్లో పాల్గొన్న పల్లం ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చూపి అవార్డులు అందుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంద్‌తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జూనియర్‌జూడో పోటీలలో నలుగురు గోల్డ్ మెడల్ 9 మంది వెండి పతకాలు సాదించటం గర్వకారణంగా ఉందన్నారు. గుంటూరులో జరిగే జూడో సబ్‌జూనియర్ పోటీలకు ఎన్నికైన వారు కే.రాము. కే,లక్ష్మణ్, కే.విష్ణు, ఇ గాయత్రిఅని వివరించారు.

## సహకార పరిశోధనలు జరగాలి



**శ్రీకాళహస్తి,ఆగస్టు 1 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తికి సమీపంలోని ఏర్పేడులో తిరుపతి ఐఐటిలో ఏఎన్ఆర్ఎఫ్ సిఇఓ శివకుమార్ కళ్యాణ్‌రామన్ పలు అంశా లపై సమీక్షలు జరిపారు. శుక్రవారం ఆయన ఐఐటిలోని అధ్యాపక బృందాలతో వివిధ అంశాలకు సంబందించి చర్చల్లో పాల్గొన్నారు. సహకార పరిశోధనా కార్యక్రమాలు, ఆవిష్కరణలవ్యూహాలపై ఆయన అధ్యాపక సభ్యులతో ఫలవంతమైన చర్చలు నిర్వహించారు. సమాకార అంతర్ విభాగ పరిశోధన ప్రతిపాదనలను పెంపొందించటం ప్రతిభావంతమైన పరిష్కారాల కోసం లోతైన సాంకేతిక పరిశోధన,అభివృద్ధి గురించి చర్చలు జరిగాయి. భారతీయ సంస్థలలో పరిశోధనా నైపుణ్యం ఆవిష్కరణలను ప్రోత్సహించటంలో ఏఎన్ఆర్ ఎఫ్ నిబద్ధతను వివరిస్తూ సమావేశం సాగింది.



## నిరుపేదలకు పక్కాఇళ్లు అదే కూటమి లక్ష్యం

**శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 1 ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి నిరుపేదలకు గూడు సదుపాయం ప్రతి ఇంటిలో ఉపాధి, ప్రతి ఇంటికి కనీసం ఒక పెన్షన్ అందించటమే లక్ష్యం కూటమి ప్రభుత్వం పని చేస్తుందని,తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు అన్నారు. శుక్రవారం ఏర్పేడు మండలంలోని చింతల పాళెం లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ భూ సమస్యలను ప్రజలు వివరించారు. ఈ కార్యక్రమాల్లో నాగరాజు నాయుడుతో పాటు రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి, రాఘవేంద్ర, చంద్రారెడ్డి, కేశినేని సుబ్రమణ్యం, మునెయ్య, మురగయ్య, నాగేశ్వరరావు, వెంకయ్య, సురేష్, జగదీష్, చంద్ర శేఖర్‌నాయుడు, కృష్ణవేణి, రాజగోపాల్, కెకె.రమణయ్య, గుణా యాదవ్, రాచాటి సుబ్రమణ్యం, వెంకటరత్నం నాయుడు, జి.సిద్దయ్య, సిజసుబ్రమణ్యం,పాల్గొన్నారు.


**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -2**

1st Floor, Triveni Complex, Palace Heights Hotel Building, Abids, Hyderabad - 1.

**O.A. No. 72 of 2025**

**Between:**

**State Bank of India, SARB, Vijayawada** .... Applicant

**And:**

**Smt. Pedapati Naga Lakshmi and another** ... Defendant

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

**To:**

**1. Smt. Pedapati Naga Lakshmi,** W/o. P. Venkataramana, Occ: Business/Proprietor of M/s. Srivari Silver and Panchalohams, R/o. 19-42-58-422, STV Nagar, AIR Bypass Road, Tirupathi, Chittoor District, Andhra Pradesh - 517501. **Also at:** Door No. 22-4-63, Flat No. 408, Block B, Sri Lakshmi Ranga Water Fronts Apartment, Vinayaka Sagar road, Magalam, Tirupathi, Chittoor District, Andhra Pradesh-517501.

**2. M/s. Srivari Silver and Panchalohams, Represented by Sole Proprietor: P. Nagalakshmi,** O/o. #19-42-58-442, Venkata Reddy Colony, STV Nagar, Tirupathi, Chittoor District, Andhra Pradesh-517501.

Take notice that the Applicant-bank has filed a case for recovery of **Rs.45,57,943/-** from you with further interest and costs. The notices sent to you were returned un-served. The Hon'ble Tribunal ordered the present paper publication under substitute of service of notice.

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under: -

(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.

(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.

(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.

(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and /or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.

(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on **11.09.2025 at 10.30 a.m. at Debts Recovery Tribunal-II, 1st floor, Triveni complex, Abids, Hyderabad-500001** in person or by advocate duly instructed as to why the relief prayed for should be granted.

Take notice that in case of default the application shall be heard and decided in your absence.

**Notice issued as per the orders of the Hon'ble Tribunal, dated 28.07.2025**

**Hyderabad** **Sd/- Registrar,**

**Dt: 01.08.2025** **Debts Recovery Tribunal-2**

# అర్హులైన పేదలందరికీ పథకాలు ఇవ్వడమే లక్ష్యం : ఎమ్మెల్యే



బాలాయపల్లి, ఆగస్టు 1 ప్రభాతవార్త: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మండలం నిండలిలో వెంకటగిరి శాసన సభ్యులు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. నూతన స్పౌజ్ పెన్షనులు రూ. 4వేలు చొప్పున వితంతువులకు అందజేశారు. ఎమ్మెల్యే దృష్టికి పలు భూసమస్యలు సంక్రాంతి రాధమ్మ, గ్రామస్థులు తీసుకొనివచ్చారు. మండలంలో 99 నూతన ఎన్టీఆర్ భరోసా స్పౌజ్ వితంతు పెన్షన్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా నూతనంగా నిర్మించిన శ్రీ వేమలమ్మ దేవస్థానంలో అమ్మవారిని దర్శించుకుని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు రావి మస్తాన్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జి రావి సత్యం నాయుడు పూజల్లో పాల్గొన్నారు. ఈ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో టిడిపి నేతలు మండలపార్టీ అధ్యక్షులు రావి మస్తాన్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జి రావి సత్యం నాయుడు, టిడిపి నేతలు జడపల్లి కోటేశ్వర గౌడ్, చిత్తూరు ఈశ్వరయ్య, దాసరి కోటి, మురళి, కమతం సుబ్రహ్మణ్యం, దొమ్మరాజు ప్రశాంతి, చెంచు కృష్ణయ్య, ఈశ్వర్, సుధాకర్ రాజు, గోపాల్ రాజు, కూని శ్రీహరి, తాళ్లూరు ప్రసాద్ నాయుడు, వేంకటాద్రి, కె.రామచంద్రనాయుడు, ఎంపీడీవో డి.జె.వినీల్ కుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి, వెలుగు ఏపిఎం కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్



## ఆర్టీసీ కార్మికుల నిరసన

సూళ్లూరుపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త: ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పద్మను సస్పెండ్ చేయడానికి నిరసనగా నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో డిపో ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కండక్టర్ పద్మను డిపో ఇన్‌ఛార్జ్ మేనేజర్‌గా ఉన్న మునిచంద్ర అకారణంగా సస్పెండ్ చేశారని యూనియన్ నాయకులు తెలిపారు. 1 నుంచి 3వ తేదీ వరకు ఎర్రబ్యాడ్జిలతో నిరసన తెలుపుతూ విధులకు హాజరవుతామని చెప్పారు. మజ్దూర్ యూనియన్ నాయకులు కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్లు పెంచిన ఘనత చంద్రబాబుదే



గూడూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త : రెండోవ పట్టణంలోని 20, 21 సచివాలయాల పరిధిలోని నర్సింగ్ రావు పేట, బి.సి.కాలనీ, ఎస్.ఆర్.ఎ. టాకీస్ ప్రాంతాలలో 4వ క్లస్టర్ కో కన్వీనర్ అరికట్ల మస్తాన్ నాయుడు, 18వ యూనిట్ ఇన్ ఛార్జ్ ఎం.డి అబ్దుల్ రహీం, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొని పెన్షన్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్‌ను పెంచిన ఘనత చంద్రబాబుకే సాధ్యమని తెలిపారు. గూడూరు అర్బన్‌లో 104 మందికి, గూడూరు రూరల్‌లో 125, భర్త చనిపోయిన తర్వాత భార్యలకు కొత్తగా పెన్షన్ ఇవ్వడంతో వితంతువులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు పరమేశ్వర గౌడ్, కేశవర్ధన్ నాయుడు, శంకర్ నాయుడు, గుండాల శ్రీదేవి, సరస్వతమ్మ పర్వీన్, అశోక్ గౌడ్, కిషోర్ సచివాలయం సిబ్బందిలు పాల్గొన్నారు.

## పనులలో నాణ్యత పాటించాలి : ఎంపీడీవో



వాకాడు, ఆగస్టు 1 ప్రభాతవార్త: మండల కేంద్రంలో ఉన్న పశువుల కుంట వద్ద జరుగుతున్నటువంటి ఎంజిఎన్ఆర్ఈజిఎ పనులను ఎంపీడీవో శ్రీనివాసులు పర్యవేక్షించారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ ఎంజిఎన్ఆర్ఈజిఎ పనులలో నాణ్యతతో పాటించాలని, ఎటువంటి సమస్యలు ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ దృష్టికి, నా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సరైన కొలతలతో పనులు చేసి రోజుకి పనికి 307 రూపాయలను వేజ్‌గా పొందాలని తెలియజేశారు. ఈ తనిఖీ లో ఫీల్డ్ అసిస్టెంట్ రమ్య పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



సూళ్లూరుపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త: సూళ్లూరుపేట నియోజక వర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందజేసిన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తన క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన స్పందించి నిధులు మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, పచ్చా మాధవనాయుడు, ఎజి కిషోర్, కొక్కు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీఏ ప్రభుత్వం హామీలన్నీ నెరవేరుస్తోంది: ఎమ్మెల్యే



తిరుపతి విద్య, ఆగస్టు 1 ప్రభాతవార్త: పెన్షన్లు సమయానికి లబ్ధిదారుల ఇంటికి వెళ్ళి అందిస్తున్న ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్పౌజ్ పెన్షన్‌లను ఐదేళ్ళ తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు పునరిద్ధరించారని ఆయన చెప్పారు. రెండో డివిజన్ సచివాలయం ఒకటి పరిధిలో పెన్షన్లను ఎన్డీఏ కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం ఉదయం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతిలో 18 వేల 773 మందికి 8 కోట్ల 25 లక్షలా 7 వేల 500 ల రూపాయులు ప్రతి నెలా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, నాయి బ్రాహ్మన కార్పోరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, డి.ఈ.రమణ, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోండి

**- కలెక్టర్, ఆర్డీవోలకు బాధితుల విజ్ఞప్తి**

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 1 ప్రభాతవార్త: తిరుచానూరు తనపల్లి మెయిన్‌రోడ్డు స్వర్ణముఖి నదిపై అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని తనపల్లి గ్రామ ప్రజలు కలెక్టర్, ఆర్డీవోలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం బాధితులు మీడియాతో మాట్లాడారు. తనపల్లి మెయిన్ రోడ్డు సమీపంలోని శ్రీ చైతన్య కాలేజ్ వద్ద కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా స్వర్ణముఖి నదిపై పధాన రోడ్డు మార్గంలో ఎటువంటి అనుమతులు లేకుండా పెద్ద పైపులు పెట్టి మట్టితో నింపి రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారన్నారు. ఈ నిర్మాణాల వలన నది ప్రవాహం నీరు ఎక్కువైతే మా గ్రామలు నీటి ప్రవాహంలో కొట్టుకుని పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కలెక్టర్, ఆర్డీవో, సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకుని మెయిన్‌రోడ్డుకు భద్రతకు అవసరమైన అన్ని ఏర్పాట్లును పూర్తి చేయాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తనపల్లి గ్రామ బాధిత ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భర్త మృతి చెందిన నెలలోపే పెన్షన్ : గంజి మాధవయ్య



పుత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామలు నెరవేరుస్తూ ప్రజల మన్ననలు పొందుతోందని పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య అన్నారు. శుక్రవారం రూరల్ మండలంలోని నేసనూరు పంచాయతీలో ఆయన స్పౌజ్ కేటగిరీ కింద పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భర్త మృతి చెందిన నెల లోపే వితంతు పెన్షన్ మంజూరు చేసి ఆ కుటుంబాన్ని ఆదుకున్నట్టు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి వుందనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షుడు అరవ బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్, యూనిట్ ఇన్‌ఛార్జ్ బాలకృష్ణారెడ్డి, ఇంకా నాయకులు మోహన్, రమేష్, సుబ్బు, శరవణ, తాతయ్యలు పాల్గొన్నారు.

## పొద్దుపొడవక ముందే పెన్షన్ల పంపిణి లక్ష్యం



శ్రీకాళహస్తి, ఆగస్టు 1 ప్రభాతవార్త : నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పెన్షన్లను ప్రతి నెల 1వ తేది సూర్యుడు పొద్దుపొడవక ముందే అందించటమే లక్ష్యంగా కూటమి ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేస్తుందని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 32వ వార్డులో ఆయన నిరుపేద మహిళలకు సామాజిక పెన్షన్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ 15 నెలలుగా ఓ వైపు అభివృద్ధి పనులను చేపడు తూ మరో వైపు రాజధాని నిర్మాణ పనులకు నిధులు సేకరించుకుంటూ నిరుపేదలకు అందించే పెన్షన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు అందించేందుకు నిధులు కేటాయిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షుడు చెంచయ్యనాయుడు, పేట బాలాజి, పోలూరు శ్రీనివాసులురెడ్డి, ముద్దునాయుడు, ఆర్ముగం కాసరం రమేష్ తదితరులు ఎపాల్గొన్నారు.

## ఎంపిటిసి ఎన్నికకు ముగిసిన నామినేషన్లు

రామకుప్పం, ఆగస్టు1 ప్రభాతవార్త : మండలంలోని మణీంద్రం ఎంపిటిసి సెగ్మెంట్ ఎన్నికకు సంబంధించి ఐదు నామినేషన్లు దాఖలైనట్లు ఆర్వో లక్ష్మీకాంత్ తెలిపారు. శుక్రవారం సాయంత్రంతో నామినేషన్ల స్వీకరణకు గడువు ముగిసింది. తెదేపా తరపున అరుణ రెండుసెట్లు, విశాలాక్షి రెండుసెట్లు, వైకాపా తరపున అర్పిత ఓసెట్ నామినేషన్ దాఖలు చేశారు. శనివారం నామినేషన్ల పరిశీలన, 5న నామినేషన్ల ఉపసంహరణ, 12న ఎన్నికలు, 14న కౌంటింగ్, ఫలితాల వెల్లడి కార్యక్రమం ఉంటుందని ఎంపిడిఒ ఆర్వో తెలిపారు.

**తెదేపా అభ్యర్థిని గెలిపించాలి : ఆర్టీసీ వైస్‌చైర్మన్**

రామకుప్పం, ఆగస్టు1 ప్రభాతవార్త : మణీంద్రం ఎంపిటిసిగా తెదేపా బలపరచే అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ సభ్యులు బిఆర్ సురేష్‌బాబు కోరారు. శుక్రవారం వారు రామకుప్పం తెదేపా కార్యాలయంలో జరిగిన ముఖ్యనేతల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వైకాపా కార్యకర్త నాగరాజు నాయక్ తెదేపాలో చేరారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, పత్ర నారాయణ, ఆనందరెడ్డి, నరసింహులు, రామూర్తి, గుర్రప్ప, కృష్ణనాయక్, రఫీ, కామరాజనాయక్, మనోహర్, అలివేలమ్మ, పద్మమ్మ పాల్గొన్నారు.

## పొన్నెంబట్టులో పింఛన్లు పంపిణీ



సూళ్లూరుపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త : మండల పరిధిలోని పొన్నెంబట్టు గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ అర్హులందరికీ పింఛన్లు ఇచ్చే ప్రక్రియ త్వరలోనే ప్రభుత్వం చేపడుతుందన్నారు. నూతనంగా రేషన్‌కార్డులు, పింఛన్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, దంతాల రవి, పామూరు మునుస్వామి, కొండలరావు, రాజశేఖర్, ఆలీ, చెన్నెం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో 474వ నేత్రదానం



సూళ్లూరుపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త : పట్టణంలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు శుక్రవారం 474వ నేత్రదానం అందింది. మండల పరిధిలోని నూకలపాలెం గ్రామానికి చెందిన ఎన్.నాగమ్మ మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యుల అంగీ కారంతో ఆమె నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి, చెన్నై శంకర్ నేత్రాలయకు పంపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ ఫలితాల్లో సత్తా చాటిన రైతుబిడ్డ



బాలాయపల్లి, ఆగస్టు 1 ప్రభాతవార్త :ఏపీ కానిస్టేబుల్ ఫలితాల్లో మండలంలోని మన్నూరు గ్రామానికి చెందిన పాల్చూరు హేమంత్ సత్తా చాటారు. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన హేమంత్ ఎంతో కష్టపడి కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించాడు. హేమంత్ తల్లిదండ్రులు మధ్య తరగతి కుటుంబంకు చెందినవారు. వ్యవసాయం చేసుకొని వారు జీవిస్తున్నారు. తన బిడ్డకు కానిస్టేబుల్ ఉద్యోగం రావడం ఆనందంగా ఉందని హేమంత్ తల్లిదండ్రులు హర్షించారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



వెంకటగిరి, ఆగస్టు 1 ప్రభాతవార్త : మండలం బుస పాలెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన ఫంక్షన్లను కూడా ఆయన అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం సంక్షేమ పథకాలను సీఎం అమలు చేస్తున్నట్లు గ్రామస్తులకు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ తనుజ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళిరెడ్డి, టిడిపి నాయకులు శివారెడ్డి, వెంకటాచలం తదితరులు ఉన్నారు.

## బెటాలియన్ అభివృద్ధికి కృషి చేస్తా : కమాండెడ్



వెంకటగిరి, ఆగస్టు 1 ప్రభాతవార్త: 9వ ప్రత్యేక పోలీసు బెటాలియన్ కమాండెంట్‌గా ఈఎస్ఎస్ ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. డిజిపి కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ప్రసాదును పదోన్నతిపై బెటాలియన్‌కు బదిలీ చేశారు. బెటాలియన్ అభివృద్ధికి తన వంతు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కమాండ్ తెలిపారు.

## ఎన్ని అడ్డంకులు సృష్టించినా పర్యటన విజయవంతం



వెంకటగిరి, ఆగస్టు 1 ప్రభాతవార్త : మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి నెల్లూరు పర్యటనకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రానేకుండా ప్రభుత్వం పోలీసులు చేత చేయించిన ప్రయత్నాలు విఫలమయ్యాయని వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఎంతమంది పోలీసులు ఆపిన లెక్కచేయకుండా వచ్చారని తెలిపారు. సైదాపురం మండలంలో ఒక రైతు నిమ్మ చెట్లను తొలగించి ఇబ్బంది పెట్టారని చెప్పారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రైతులు ఆక్రమించిన పొలాలకు ఆరు నెలల క్రితం పట్టాలు ఇప్పిస్తానని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని రైతులు చెప్పారని తెలిపారు. ఈ సమావేశంలో చైర్పర్సన్ నక్క భానుప్రియ, వైస్ చైర్మన్ బాలయ్య, కౌన్సిలర్స్ సుబ్బారావు, వహీదా, కళ్యాణి, శ్రీనివాసులు, నారాయణ, శంకరయ్య నాయకులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



బాలాయపల్లి, ఆగస్టు 1 ప్రభాతవార్త: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. వెంగమాంబ పురం బిసి హాస్టల్ను ఆయన తనిఖీ చేశారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు రావని సూచించారు. వంటగది, విద్యార్థులు ఉండే గదులను పరిశీలించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. హాస్టల్ వార్డును శ్రీనివాసులు పరిసర ప్రాంతాల్లో కూరగాయలను పండించడం పట్ల అభినందించారు. ఆయన వెంట రత్నమ్మ ఉన్నారు.

## తల్లిపాలే బిడ్డలకు శ్రేయస్కరం సిడిపిఓ

వెంకటగిరి, ఆగస్టు1 ప్రభాతవార్త: తల్లిపాలే పొలిటి బిడ్డలకు శ్రేయస్కరమని సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. పట్టణంలోని బొప్పాపురం తదితర అంగన్వాడి కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు పులిటి బిడ్డకు ఇచ్చినందువల్ల బూస్ట్ ఫీడింగ్ ఇచ్చినట్టే ఉంటుందని తెలిపారు. బిడ్డలకు సరైన పోషణ అందుతుందని చెప్పారు. సమావేశంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన పేర్నాటి



కోట, ఆగస్టు 1 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనకు వచ్చిన సందర్భంగా రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ మేరకు జగన్‌ను శాలువాతో సన్మానించారు. పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ దేశంలో అత్యంత ప్రజాదరణ ఉన్న అతికొద్దిమంది నాయకుల్లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒకరని చెప్పారు. జగన్‌ను చూసేందుకు వస్తున్న జనాన్ని చూసి సీఎం చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వానికి భయం పట్టుకుందన్నారు. ఎవరెన్ని చేసినా జనం నుంచి ప్రజలను దూరం చేయలేరని స్పష్టం చేశారు.

## 118 మందికి కొత్త పింఛన్లు పంపిణీ

కోట, ఆగస్టు 1 ప్రభాతవార్త: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 118 మంజూరైనట్లు ఎంపిడిఓ వేణు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో పింఛన్లను జిల్లా తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, ఎంపిటిసిలు షంషుద్దీన్, దారా సురేష్ పంపిణీ చేశారు. వెంకన్నపాలెంలో సర్పంచ్ మధుయాదవ్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారని ఎంపిడిఓ వేణు తెలిపారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య!

కోట, ఆగస్టు 1 ప్రభాతవార్త : కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామ సమీపంలో కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు నెల్లూరుకు చెందిన ఆంజనేయప్రసాద్ (55) కోట మండలం కొత్తపాలెం గ్రామంలో వివాహం చేసుకున్నాడు. గత నాలుగేళ్ల నుంచి భార్యభర్తలకు మనస్పర్థలు ఉన్నాయి. ఆంజనేయప్రసాద్ గురువారం తన భార్య స్వగ్రామానికి వచ్చాడు. ఏమయిందో గాని ఆయన చెట్టుకు ఉరేసుకుని శవమై కనిపించాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పవన్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## ఐటా ఉమెన్స్ వన్ ల్యాక్ సింగిల్స్ విన్నర్‌గా లక్ష్మి సిరి దండు



గూడూరు, ఆగస్టు 1, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో జూలై 28 నుండి ఆగస్ట్ 1వరకు జరిగిన ఐటా ( ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్) ఉమెన్స్ వన్ ల్యాక్ టోర్నమెంట్‌లో గూడూరు పట్టణానికి చెందిన లక్ష్మి సిరి దండు గెలుపొందారు. ఈమె క్వార్టర్ ఫైనల్స్‌లో తెలంగాణకి చెందిన తానియా సా పై 6-0, 1-0(రిటైర్డ్)తో గెలుపొందారు. సెమీ ఫైనల్స్ లో తెలంగాణకి చెందిన మనోజ్ఞ మదను 6-1, 2-6, 4-1 ( రిటైర్డ్)పై గెలుపొందింది. అదే విధంగా ఫైనల్స్‌లో తమిళనాడుకి చెందిన జోయల్ నికోల్ 6-1, 6-3పై గెలుపొంది. టోర్నమెంట్ విజేతగా నిలిచారు.

## బాలింతలు, వృద్ధులకి పౌష్టికాహారం పంపిణీ



గూడూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త: కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల సహాయ సహకారాలతో తిరుపతి జిల్లా గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందు ప్రతినెల క్రమం తప్పకుండా జరిగే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 50 మంది వృద్ధులకు, బాలింతలకు గూడూరు ప్రభుత్వ హాస్పిటల్ సూపరిడెంట్ డాక్టర్ షరీనా, డా. హెలిన్ చేతులమీదుగా పౌష్టికాహారం, పండ్లు, బ్రెడ్, వాటర్, బాటిల్, బిస్కెట్లు పంపిణీ చేసారు. కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా మా ట్రస్ట్ సభ్యులు సహాయ సహకారాలతో గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందు ఉన్న పేద ప్రజలకు మా వంతుగా మేము ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు అత్తి మంజరి గోపాల్, జాయింట్ సెక్రెటరీ పేయ్యల రమణయ్య, సలహాదారి చవల సురేంద్రబాబు, సభ్యులు కసుకుర్తి కోటేశ్వరరావు హాస్పిటల్ సిబ్బంది సాయి తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సిఎంకు కృతజ్ఞతలు



గూడూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త: దూదేకుల పై దాస్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మా నూరు భాషా సోదరులందరి మీద చాలా దయవుంచి ఒకపక్క కార్పొరేషన్ మరోపక్క ఇండియన్ ముస్లిం నూర్ భాషా దూదేకులనే సర్కిల్ ఇవన్నీ చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సర్క్యులర్ రెవెన్యూ ఆఫీస్‌కి ఇవ్వవలసిందిగా మా స్టేట్ ప్రధాన కార్యదర్శి సలీం బాయ్ తమకు సర్కిల్ పంపిస్తూ తెలిపారు. తాము వెంటనే ఎమ్మార్వోకి దగ్గరికి మా కమిటీని తీసుకెళ్లి ఒక వినతి పత్రం ఇస్తూ సర్క్యులర్ కాపీ ఇచ్చామన్నారు. ఎమ్మార్వో వెంటనే స్పందించి అన్ని సచివాలయాలకు ఆదే సేవలు ఇవ్వవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ప్రెసిడెంట్ చెందు భాష, స్టేట్ వర్కింగ్ మహిళా ప్రెసిడెంట్ షేక్ దిల్షాద్, వైస్ ప్రెసిడెంట్ ఇబ్రహీం, జాయింట్ సెక్రెటరీ చాంద్ బాషా, టైలర్ సెక్రెటరీ నజీర్, గాంధీనగర్ సలీం, మహిళ కార్యదర్శి సలీమా, తదితరులు పాల్గొన్నారు.

## నూతన పింఛన్లు పంపిణీ



చిల్లకూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త: మండలంలోని తొణు కుమాల గ్రామ పంచాయతీలో ఎన్టీఆర్ ఫించన్ భరోసా కార్యక్రమం నిర్వహించారు. మండలం లోని 30 గ్రామ పంచాయతీలో నాయకులు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ మండల బీసీ సెల్ అధ్యక్షులు మేకల కుమార్, గ్రామ సర్పంచ్ బొమ్మళ త్రివిక్రమ్, ఉప సర్పంచ్ అరిపి నేటి విజయ భాస్కర్, తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## చీప్ అండ్ బెస్ట్ సెలూన్ షాపులపై పోరాటాలు ఉధృతం




తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 1 ప్రభాతవార్త : నగరంలో చీప్ అండ్ బెస్ట్ సెలూన్ షాపులపై పోరాటాలు ఉధృతం చేస్తున్నామని ఏపీ నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర నూతన కమిటి అధ్యక్షులు జయకుమార్, సెక్రెటరీ గల్లా దాము, ట్రెజరర్ ఉప్పలపాటి శివ హెచ్చరించారు. రాష్ట్ర నేతలు సిబ్యాల సుధాకర్, పాకాల సురేంద్ర, గౌరవ అధ్యక్షులు రాంనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని చీప్ అండ్ బెస్ట్ సెలూన్ కార్పొరేట్ షాపుల ముందు ఏర్పాటు చేసిన తక్కువ రేట్లు కలిగిన బోర్డులను పీకేశారు. వారు మాట్లాడుతూ నాయిబ్రాహ్మణ కులాన్ని అడ్డం పెట్టుకుని కార్పొరేట్ సంస్థల ముసుగులో నాయిబ్రాహ్మణుల వృత్తికి నష్టం చేస్తున్నారన్నారు. ఐకమత్యంతో నాయిబ్రాహ్మణ సోదరులు, అసోసియేషన్ నూతన నేతలు సంఘం బలోపేతానికి, నాయిబ్రాహ్మణ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు వడ్డమూరి కమల్, అవిలాల మునికృష్ణయ్య, యుగంధర్, బజంత్రి రవి, నగర నాయిబ్రాహ్మణ నూతన సంఘం నేతలు, సభలు, నాయిబ్రాహ్మణులు పాల్గొన్నారు.

## మాతమ్మ కొలువుకు రూ.50వేలు వితరణ

**-సతీ సమ్మేతంగా మాతమ్మకు పట్టువస్త్రాలు సమర్పణ**



తిరుపతిరూరల్, ఆగస్టు1 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం చిగురువాడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూరు హరిజనవాడ మాతమ్మ కొలువుకు టిడిపి నేత వార్తాల శివ యాదవ్ రూ.50వేల రుపాయాలు విరాళంగా అందజేసి, తన దాతృత్వాన్ని చాటుకున్నారు. అలాగే మాతమ్మకు శివ యాదవ్ సతీసమ్మేతంగా పట్టువస్త్రాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కు తీర్చుకు న్నారు. కొత్తూరు హరిజనవాడలో మాతమ్మ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్న విషయం తెల్సిందే. శివ యాదవ్ తన స్వంత నిధులు రూ.50వేల రుపాయాల నగదును పినపెద్ద వెంకటరామయ్య, పెద్దలు జయరామయ్యకు అందజేసారు. మాతమ్మ ఆలయ అభివృద్ధి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ప్రతి ఏడాది జరిగే మాతమ్మ తిరునాళ్ళకు పట్టువస్త్రాలు సమర్పించే అనవాయితీని ఎంచుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్తల శ్రీనివాస్, మల్లీశ్వరరెడ్డి, నాగరాజుయాదవ్, మునస్వామి, భాస్కర్‌యాదవ్, నరేంద్ర, బాల, రఫీ, రుద్రయ్య, బాబు, హనుమాన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాదారుల నుంచి మా ఇంటిని కాపాడండి!

**- ఎస్పీకి సీనియర్ జర్నలిస్టు సుధీర్ వినతి**

తిరుపతి హెల్త్, ఆగస్టు 1 ప్రభాతవార్త : కబ్జాదారుల నుంచి మా ఇంటిని కాపాడాలని సీనియర్ జర్నలిస్టు బాధితుడు సుధీర్ తిరు పతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం సుధీర్ జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. బాధితుడు సుధీర్ మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ఆలయం సమీపంలో సాదూరు మఠం వద్ద టీటీడీ 1977లో ఇంటిని కేటాయించడం జరిగిందన్నారు. మా నాన్న లేట్ క్రిష్టయ్యకు అప్పట్లో వయస్సు తక్కువుగా ఉన్న కారణంగా ఉమ్మడి కుటుంబంలో ఉన్న మా నాన్న అక్క అయిన కె.సుబ్బరత్నమ్మ పేరుపై టీటీడీ అధికారులు ప్రొసిడింగ్ ఇచ్చి ఇంటిని అలాట్‌మెంట్ చేయడం జరిగిందని తెలిపారు. ఆ ఇంటిని నా పేరు మీద, మా నాన్న చెల్లెలు కుమారుడు శ్రీధర్ పేర్లపై వీలునామా రాసి ఆమె మృతి చెందిందని చెప్పారు. మా అత్త మరణాంతరం ఆ ఇంటిని ఆరు నెలల పాటు మూసి వేయాలని కుటుంబ సభ్యులంతా నిర్ణయించుకుని ఇంటికి తాళాలు వేశామన్నారు. అయితే మా నాన్నకు చెల్లెలు జయమ్మ కుమార్తె విజయలక్ష్మి, తల్లి జయమ్మ ఆమె భర్త నాగభూషణం అలియాస్ టోకీ (టీటీడీ విశ్రాంత ఉద్యోగి) తాళాలు వేసి ఉన్న ఇంటిలోకి ప్రవేశించి తాళాలు పగలగొట్టి మా ఇంటిలోని సామాన్లు, ఇతరత్రా వస్తువులను బయట పడవేసి ఇంట్లో మకాం వేశారు. తిరుమల రెవెన్యూ అధికారులు సర్వేకు రాగా వారికి నకిలీ డాక్యుమెంట్లను, జిరాక్స్ కాపీలను అందజేశారు. వారు ఇచ్చిన పత్రాలు నకిలీ అని విజిలెన్స్ అధికారులు నిగ్గు తేల్చి, ఒరిజనల్ డాక్యుమెంట్లను తీసుకుని రావాలని చెప్పడంతో వారు చేసేది ఏమీలేక నన్ను బెదిరించడంతో పాటు చంపడానికి ప్రయత్నించారు. విధిలేని పరిస్థితిలో ఓ పత్రిక విలేకరిగా తిరుపతిలో పనిచేస్తూ జీవనాన్ని గడుపుకుంటున్నాను. ఎస్పీగారూ వెంటనే మీరు స్పందించి ఇంటిలో దౌర్జనంగా తిష్ట వేసిన విజయలక్ష్మి, ఆమె భర్త నాగభూషణం అలియాస్ టోకీ, విజయలక్ష్మి అమ్మ జయమ్మలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు మా ఇంటిని మాకు స్వాధీనం చేసి నాకు మా కుటుంబ సభ్యులకు ప్రాణ రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎస్పీ తన పరిధి మేరకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## శ్రీవాణి టిక్కెట్ల జారీ...నూతన విధానం సౌకర్యంగా ఉంది

**-ఆరంభమైన ఏరోజుకారోజు దర్శనమ్ !**

తిరుమల, ఆగస్ట్ 1ప్రభాతవార్తప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని మరింత దగ్గరగా కులశేఖరపడి వద్దనుండి దర్శనం చేసుకునే సదుపాయం ఉన్న శ్రీవాణి బ్రేక్‌దర్శనాల టిక్కెట్ భక్తులకు ఏరోజుకారోజు దర్శనమ్ అమలైంది శుక్రవారం ఉదయం 10గంటలనుండి 800 టిక్కెట్లు ఆఫ్‌లైన్‌లో జారీచేసిన తరువాత శ్రీవాణి కౌంటర్లు మూసివేశారు. అలాగే రేణిగుంట విమానాశ్రయంలో 200 టిక్కెట్లు జారీ అవుతాయి. ఈ టిక్కెట్ పొందిన భక్తులందరికీ సాయంత్రం 4.30గంటలకు వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ నుండి అనుమతించారు. ప్రయోగాత్మక విధానం శుక్రవారం సాయంత్రం విజయవంతంగా అమలు చేశారు. భక్తులు కూడా ప్రశాంతంగా, సాఫీగా వచ్చి టిక్కెట్లు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని అభిప్రాయాలు వ్యక్తం చేశారు. తొలిరోజు శుక్రవారం ఉదయం భక్తులను అనుమతించే విధానం, కౌంటర్లలో సిబ్బంది టిక్కెట్లు జారీని స్వయంగా టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పర్యవేక్షించారు.